Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 92 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 11 - 10 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## కాబుల్‌లో భారత రాయబార కార్యాలయం






**ఢిల్లీ :** ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వంలో తాత్కాలిక విదేశాంగ శాఖ మంత్రిగా ఉన్న ఆమిర్‌ఖాన్ ముత్తాఖీతో భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ భేటీ అయ్యారు. ఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో ఇరువురు నేతలు రెండు దేశాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబుల్‌లో భారత రాయబార కార్యాలయం మళ్లీ తెరుస్తామని ఈ సందర్భంగా జైశంకర్ ప్రకటించారు. ఉగ్రవాదాన్ని ఏరివేసేందుకు ఇరు దేశాలు కలిసి పోరాటం చేస్తాయని ఇరుదేశ విదేశాంగ నేతలు ప్రకటించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించిన జైశంకర్.. సీమాంతర ఉగ్రవాదం పెంచి పోషిస్తున్న కొన్ని దేశాలకు త్వరలోనే తగిన బుద్ధి చెబుతామని వార్నింగ్ ఇచ్చారు.

భారతదేశ భద్రతా సమస్యల పట్ల ఆఫ్ఘనిస్థాన్ చూపిస్తున్న సున్నితత్వాన్ని, సంఘీ భావాన్ని భారత్ అభినందిస్తుందని జైశంకర్ పేర్కొన్నారు. ఇక, ఆఫ్ఘనిస్థాన్ ఎక్సలెన్సీ, వృద్ధి, శ్రేయస్సు పట్ల తమ దేశానికి నిబద్ధత ఉందని జైశంకర్ తెలిపారు. అయితే, రెండు దేశాలు ఎదుర్కొంటున్న సీమాంతర ఉగ్రవాదపు ఉమ్మడి ముప్పు వల్ల ఇవి ప్రమాదంలో ఉన్నాయని చెప్పుకొచ్చారు. అలాగే, ఆఫ్ఘనిస్తాన్ స్థిరత్వానికి భారత దేశం దీర్ఘకాలంగా మద్దతు ఇస్తుందని జైశంకర్ హామీ ఇచ్చారు. ఆఫ్ఘనిస్తాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతతో పాటు ఆ దేశ స్వాతంత్ర్యానికి తాము పూర్తిగా కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య సన్నిహిత సహకారం.. జాతీయ అభివృద్ధికి, అలాగే ప్రాంతీయ స్థిరత్వానికి దోహదపడుతుందని జైశంకర్ తెలిపారు.

**కాబూల్ మీద వరుస వైమానిక దాడులు.. అనేక ప్రాంతాల్లో భారీ పేలుళ్లు**

ఇలా ఉండగా, ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్ రాత్రి బాంబులతో దద్దరిల్లిన సంగతి తెలిసిందే. నగరంలోని అనేక చోట్ల రాత్రి పేలుళ్లు, కాల్పుల శబ్దాలు వినిపించాయి. మృతుల సంఖ్య ఇంకా వెల్లడించలేదు. ఈ వైమానిక దాడులు ఎవరు చేశారనే దానిపైనా స్పష్టత లేదు. గుర్తు తెలియని విమానాల ద్వారా వైమానిక దాడులు జరిగినట్టు సమాచారం. భారత్‌తో ఆర్థిక సంబంధాలను పెంచుకునే లక్ష్యంతో చర్చల కోసం ఆఫ్ఘన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకి భారతదేశానికి చేరుకున్న సమయంలో కాబూల్‌లో పేలుళ్లు సంభవించిడం విశేషం. 2021లో అధికారం చేజిక్కించుకున్న తర్వాత, తాలిబన్ నాయకుడు భారతదేశానికి చేసిన మొదటి పర్యటన ఇది.

## నందగోకులంలో చంద్రబాబు పర్యటన.. లైఫ్ స్కూల్ ప్రారంభం




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సమాజం వల్ల పైకి వచ్చిన ప్రతి ఒక్కరూ సమాజానికి తిరిగి ఇవ్వాలని సీఎం చంద్రబాబు సూచించారు. నెల్లూరు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ నేపథ్యంలో నందగోకులం లైఫ్ స్కూల్‌కు చంద్రబాబు శ్రీకారం చుట్టారు. అనంతరం విశ్వసముద్ర బయో ఎనర్జీ ఇథనాల్ ప్రాంట్‌ను సందర్శించారు. అలాగే.. విశ్వసముద్ర గ్రూప్ ప్రాజెక్టలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు.

**ఎద్దులతో విద్యుత్తు ఉత్పత్తి చేయడం ఎక్కడా లేదు..**

నందగోకులంలో పశువుల పరిరక్షణ, లైఫ్ స్కూల్, ఇథనాల్ ప్లాంట్‌ను ప్రారంభించడం తనకు కొత్త ఎక్స్‌పీరియన్స్ అని చంద్రబాబు తెలిపారు. 15,000 టన్నుల ధాన్యం నూకలతో ఇథనాలు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. దీని ద్వారా రైతులకి ఆదాయం పెరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రకృతి పరిరక్షణకి కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలని అందిపుచ్చుకున్నారని చెప్పారు. ఎద్దులతో విద్యుత్తు ఉత్పత్తి చేయడం ఎక్కడా లేదని చెప్పారు. పవర్ ఆఫ్ బుల్స్ చాటుతూ.. 5 యూనిట్లు విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారని చంద్రబాబు వివరించారు.

**సేవ్ ది బుల్ అనే నినాదం ఎంతో విశిష్టమైంది..**

నందగోకులం సేవ్ ది బుల్ అనే నినాదం ఎంతో విశిష్టమైందని చంద్రబాబు గుర్తు చేశారు. నందగోకులం లైఫ్ స్కూల్లో పేద పిల్లలకి చదువులు చెబుతున్నారని చెప్పారు. సామాన్య పిల్లలని అనితరసాధ్య వ్యక్తులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. సమాజం వల్ల పైకొచ్చిన వారు సమాజానికి డబ్బు ఇవ్వడం కాదు. పిల్లలకి అన్ని సదుపాయాలు కల్పించి, బెస్ట్ సిటిజన్స్‌లా తయారు చేయాలని ఆయన సూచించారు.

**విశాఖలో రూ.87వేల కోట్లతో ఆర్టిఫిషియల్ సెంటర్..**

పి4 మోడల్లో చింతా శశిధర్ ఫౌండేషన్ ది బెస్ట్ స్కూల్ నడుపుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. దగదర్తిలో ఎయిర్ పోర్టు, కృష్ణపట్నంకి సీ పోర్టు, నేషనల్ హైవే, రైల్వే కనెక్టవిటీలు వస్తాయని స్పష్టం చేశారు. 2047లో ప్రపంచంలోనే మనదేశం ఒక శక్తిగా ఎదగబోతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అందులో మన ఏపీ మరింత శక్తిగా ఎదుగుతుందని వివరించారు. విశాఖలో రూ. 87 వేల కోట్లతో ఆర్టిఫిషియల్ సెంటర్ రాబోతుందని చెప్పారు. పేదలని బయటకి తీసుకు వచ్చే బాధ్యత అందరూ తీసుకోవాలని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## కార్మిక సంక్షేమ బోర్డులో వర్కింగ్ జర్నలిస్టులను చేర్చేందుకు పరిశీలిస్తా

### - రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ

**అమరావతి, (రాజధాని వార్తలు):** వర్కింగ్ జర్నలిస్టులను కార్మిక సంక్షేమ బోర్డులో చేర్చేందుకు గల అవకాశాలను పరిశీలిస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రతినిధి వర్గం ఆయనను కలిసి జర్నలిస్టులను కార్మిక సంక్షేమ బోర్డులో చేర్చాలని చేసిన విజ్ఞప్తిపై ఆయన సానుకూలంగా స్పందించారు. గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే విలేకరులు నిర్దిష్టమైన సదుపాయాలు ఆదాయాలు లేని పరిస్థితులలో పనిచేస్తున్నారని వారికి అసంఘటితరంగా కార్మికులు పొందే సదుపాయాలు కల్పించేందుకు వీలుగా కార్మిక సంక్షేమ బోర్డులో చేర్చాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ చేసిన ప్రతిపాదనపై మంత్రి ఈ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో జర్నలిస్టుల వేతనాల అమలు తీరుకు సంబంధించి జస్టిస్ గురుభక్ష మాటిజియా సిఫార్సుల అమలు జరుగుతున్న తీరుతన్నులను పర్యవేక్షించేందుకు వీలుగా త్రైపాక్షిక కమిటీ ఏర్పాటుకు కూడా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం



చేశారు. కార్మిక శాఖ మంత్రిని కలిసిన ప్రతినిధి వర్గంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు నాయకులు, రాజధాని వార్తలు ఎడిటర్ హుస్సేన్ ఖాన్ తదితరులున్నారు.

## వైద్య విద్యలో పేదలకు అవకాశం ఇవ్వడమే పీపీపీ మోడల్ ఉద్దేశ్యం

**అమరావతి, (రాజధాని వార్తలు):** మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం వెళ్లి గోడలు, ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు చూసి వచ్చారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. వాటిని చూసి ఆహా.. ఓహో.. అంటూ ప్రజల్ని మోసం చేసే విధంగా డ్రామాలు ఆడారని ఆరోపించారు. పీపీపీ మోడల్ అంటే ప్రైవేట్‌కి అమ్మేయడం కాదు.. పనుల్లో ప్రైవేట్ సహకారం మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. కాలేజీల నియంత్రణ అంతా ప్రభుత్వం చేతుల్లోనే ఉంటుందని పట్టాభిరామ్ స్పష్టం చేశారు. వైద్య విద్యలో నాణ్యత పెంచడం, పేదలకు అవకాశం ఇవ్వడమే పీపీపీ మోడల్ ఉద్దేశ్యమని కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. పీపీపీ పద్ధతిలో ప్రతి మెడికల్ కాలేజీలో 50% సీట్లు పేద విద్యార్థులకే కేటాయిస్తామని పేర్కొన్నారు. అలాగే.. పేద విద్యార్థులకు అదే కేటాగిరి కింద రూ.15 వేల కేటాయించబడతాయని చెప్పారు. పీపీపీ పద్ధతిని నేషనల్ మెడికల్ కమీషన్ చైర్మన్ డాక్టర్ అభిజాత్ సేట్ సమర్థించారని గుర్తు చేశారు. వైద్య విద్యను ముందుకు తీసుకు వెళ్లాలంటే పీపీపీ సరైన దారి అని ఎన్ఎంసీ స్పష్టం చేసిందని వెల్లడించారు. పీపీపీ కాలేజీల ద్వారా పేద విద్యార్థులకు తక్కువ ఫీజుతో మెడికల్ చదివే అవకాశం కలుగుతోందని పట్టాభిరామ్ ఆశాభావం వ్యక్తం



చేశారు. జీవో నెం.108 విడుదల చేసింది జగన్ ప్రభుత్వమే అని గుర్తు చేశారు. అదే జీవోను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ జీవో ప్రకారమే జరుగుతున్న పనుల్ని వైసీపీ నేతలు కుట్రపూరితంగా అడ్డుకుంటు న్నారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మండిపడ్డారు.

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు.. రూ.1.17 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ కేబినెట్ కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈ మేరకు ఇవాళ (శుక్రవారం) సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంపై మంత్రి మాట్లాడారు. ఇవాళ జరిగిన క్యాబినెట్ మీటింగ్ రాష్ట్ర ఆర్థిక పురోగతి, ఏఐ అభివృద్ధికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఎస్ఐపీబీ మీటింగ్‌లో చర్చించిన నిర్ణయాలకూ క్యాబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి కొలుసు స్పష్టం చేశారు. గడిచిన 15 నెలల కాలంలో రాష్ట్ర అభివృద్ధి, ప్రజల శ్రేయస్సుకు అనేక పాలసీలు ఇచ్చామని కొలుసు పార్థసారథి తెలిపారు. వివిధ పాలసీలకు అనుగుణంగా ప్రోత్సాహకాలు ఇచ్చి రూ. 1.17లక్షల కోట్ల పెట్టుబడులకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు చెప్పారు. సుమారు 70 వేల ఉద్యోగాలు వచ్చేలా క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. అలాగే టాటా పవర్ రెన్యూవబుల్ లిమిటెడ్ ప్లాంటు, చింతా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ప్రాజెక్టులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. తోటపల్లి బ్యారేజి నుంచి 24 ఎంసీఎం నీటిని ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. దీనితో పాటు ఎవాపరేషన్ లాసెస్‌కూ నీటిని కేటాయించినట్లు తెలిపారు. రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడెక్ట్‌ల కింద కర్నూలు జిల్లాలో రూ.758 కోట్లతో ఫ్యాక్టరీ నెలకొల్పడానికి ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా 500 మందికి ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. టూరిజం పాలసీ ఒక గేమ్ ఛేంజర్ అందుకే దానిపై కేబినెట్ ప్రత్యేక దృష్టిపెట్టినట్లు చెప్పుకొచ్చారు. దాని కోసం ప్రత్యేకమైన ల్యాండ్ పార్సిల్స్ ఏర్పాటు చేయలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో.. బీజేపీ అభ్యర్థి బీఆర్ఎస్సే



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** హైదరాబాద్ మహానగరంలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఎన్నికల నగారా మోగింది. అభ్యర్థుల ఎంపికపై రాజకీయ పార్టీల నేతలు, అధినేతలు కసరత్తు చేస్తున్నారు. ఆ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్ యాదవ్ పేరును ఆ పార్టీ అధిష్టానం ఇప్పటికే ఖరారు చేసింది. ఇక బీఆర్ఎస్ పార్టీ మాత్రం దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీతను బరిలో నిలిపింది. బీజేపీ సైతం అభ్యర్థిని ప్రకటించేందుకు సిద్ధమవుతుంది. అలాంటి వేళ.. బీజేపీలో చోటు చేసుకుంటున్న వరుస పరిణామాల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి శుక్రవారం తన ఎక్స్ ఖాతా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో.. బీజేపీ అభ్యర్థి బీఆర్ఎస్సే అంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు.. కారు గుర్తుకు ఓటు కమల పార్టీ బలోపేతానికే అంటూ హింట్ సైతం ఇచ్చారు. దిక్కుతోచని స్థితిలో బీజేపీ కార్యకర్తలు, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు అంటూ ఆయన ఎద్దేవా చేశారు. చివరగా బీజేపీ ఈక్వల్ టూ బీఆర్ఎస్ అంటూ ఇంగ్లీష్ అక్షరాలతో రాసుకొచ్చారు. చివరగా జూబ్లీహిల్స్ బై ఎలెక్షన్స్ అంటూ ట్యాగ్ చేశారు. కారు, కమలం గుర్తులు ఉన్న ఫోటోలను ఎక్స్ వేదికగా ఆయన పోస్ట్ చేశారు. 2023 ఏడాది చివరిలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ఓటరు పట్టం కట్టినా.. హైదరాబాద్ మహానగరంలోని ప్రజలు మాత్రం బీఆర్ఎస్ పార్టీకే పట్టం కట్టారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ జంట నగరాల్లో తన ప్రభావాన్ని నిలుపుకొంది. ఆ క్రమంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపినాథ్ వరుసగా మరోసారి గెలిచారు. అయితే ఆయన తీవ్ర అనారోగ్యం కారణంగా ఇటీవల మరణించారు. దీంతో ఈ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి గోపినాథ్ సతీమణి సునీత పేరును ఆ పార్టీ అగ్రనాయకత్వం ఖారారు చేసింది. ఇక అధికార కాంగ్రెస్ పార్టీ మాత్రం గత ఎన్నికల్లో బరిలో నిలిచి ఓడిన నవీన్ యాదవ్‌కు అవకాశం ఇచ్చింది. అదీకాక గతంలో ఇదే అసెంబ్లీ నియోజకవర్గంలోని ఒక డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. బీజేపీ మాత్రం అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు పలువురి పేర్లను పరిశీలిస్తుంది. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేరును నిజామాబాద్ ఎంపీ ధర్మపూరి అర్వింద్ తాజాగా తెరపైకి తీసుకు వచ్చారు. ఆయనకు గతంలో ఏబీవీపీతో అనుబంధం ఉందంటూ ఈ సందర్భంగా బీజేపీ ఎంపీ అర్వింద్ వ్యాఖ్యానించారు. దీనిపై బొంతు రామ్మోహన్ వెంటనే స్పందించారు. తాను కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని.. బీజేపీ నుంచి బరిలో దిగే ప్రసక్తే లేదంటూ కుండ బద్దలు కొట్టారు.

# జి ఎస్ టి 2.0 సంస్కరణల ఫలాలు ఇంటింటికి చేర్చాలి

**- జీఎస్‌టీ 2.0తో ప్రజలు, వ్యాపారస్తులు చాలా సంతోషంగా ఉన్నారు - ప్రధాని నరేంద్ర మోడి చేపట్టిన జీఎస్టీ సంస్కరణలు దేశ వ్యాప్తంగా ప్రజలకు దసరా కానుకలాంటివి - సూపర్ సిక్స్ అమలుతో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ సారధ్యంలో రాష్టంలో సంక్షేమ పాలన కొనసాగిస్తుంది - జీఎస్‌టీ 2.0 సంస్కరణల ద్వారా దాదాపు 83 రకాల వస్తువుల ధరలు తగ్గాయి - జిఎస్టీ తగ్గడం వల్ల ప్రతి కుటుంబానికి నెలకు 15 వేల వరకు ఆదా అవుతుంది - రాజుపాళెంలో జి ఎస్ టి 2.0 ప్రయోజనాలపై ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**






**నెల్లూరు ప్రతినిధి, (రాజధాని వార్తలు):**పేద మధ్యతరగతి వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజారంజక పాలన అంది స్తున్నారన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కొడవలూరు మండలం రాజుపాళెం గ్రామంలో ఆమె వ్యాపారస్థులకు, ప్రజలకు జి ఎస్ టి 2.0 ప్రయోజనాలపై అవగహన కార్యక్రమాన్ని చేప ట్టారు. ఈ సందర్భంగా జి ఎస్ టి 2.0 సంస్కరణలకు సంబం ధించిన వివరాలతో కూడిన ప్ల కార్డులు ప్రదర్శిస్తూ వ్యాపార కూడలిలో చిన్నపాటి ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి షాపుల వద్దకు వెళ్లి ఏ ఏ వినియోగ వసతులపై ఎంత శాతం జిఎస్టి తగ్గింది అనే విషయాన్ని అటు వ్యాపార స్థులకు ఇటు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ జీఎస్‌టీ తగ్గింపుతో ధరలు తగ్గి ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. గతంలో నాలుగు స్లాబులుగా ఉన్న జీఎస్‌టీని నేడు 2 స్లాబులకు తీసుకు రావడం పట్ల వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికి జీఎస్టీ ప్రతిఫలాలు అందించేందుకు కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీకి, సీఎం చంద్రబాబు నాయుడు కి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, ధన్యవాదాలు తెలిపారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇంటింటికెళ్లి జిఎస్టి 2.0 ప్రయోజనాలను ప్రజలకు విడమర్చి చెప్పాలన్నారు. గతంలో వ్యవసాయ ట్రాక్టర్ల పై 12 శాతం వున్న జిఎస్టి ఇప్పుడు 5% శాతానికి తగ్గించారని, ట్రాక్టర్ల టైర్లు, ఇతర స్పేర్ పార్ట్స్ పై 18 శాతం వున్న జిఎస్టి ప్రస్తుతం 5 శాతానికి తగ్గిందన్నారు. హార్వెస్టర్, రోటావేటర్ లాంటి వ్యవసాయ పరికరాలు, ఫర్టిలైజర్సు మరియు పురుగు మందులు, డ్రిప్ ఇరిగేషన్‌కు సంబంధించిన స్ప్రింక్లర్ల పై గతంలో 12 నుంచి 18 శాతం వున్న జిఎస్టి యిప్పుడు 5 శాతానికి తగ్గించిన విషయాన్ని ఆమె ప్రజలకు తెలిపారు. గతంలో బియ్యం. ఉప్పు, పప్పు, పాలు, గుడ్లు తదితర ఆహార వస్తువులపై 5 శాతం వున్న జిఎస్టిని ఇప్పుడు పూర్తిగా మినహాయించడం జరిగిం దన్నారు. అలాగే విద్యార్థులు ఉపయోగించే నోట్ బుక్స్, పెన్స్ లాంటి స్టేషనరీ ఉత్పత్తులపై గతంలో 5 నుంచి 12 శాతం వున్న జిఎస్టిని పూర్తిగా తొలగించి జీరో జిఎస్టి జాబితాలో చేర్చారన్నారు.

సామాన్యులు ఉపయోగించే 83 రకాల వస్తువుల మీద జిఎస్టి తగ్గడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగ వుతున్నాయన్నారు. గతంలో లైఫ్ ఇన్స్యూరెన్స్ మీద వున్న 18 శాతం జిఎస్టి క్యాన్సర్‌లాంటి ప్రాణాంతక వ్యాధి ఔషధాలపై వున్న 12 శాతం జీఎస్‌టీని పూర్తిగా తొలగించారన్నారు. జిఎస్టి తగ్గడం వల్ల ప్రతి కుటుంబానికి నెలకు 15 వేల వరకు ఆదా అవుతుందన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యంగా కేంద్రం జిఎస్టి 2.0ను ప్రవేశపెట్టగా.. స్వర్ణాంధ్ర 2047 దిశగా సీఎం చంద్రబాబు సంక్షేమం మరియు అభివృద్ధి దిశగా అడగలు వేస్తు న్నారని 16 నెలల కూటమి పాలనలో జరిగిన ప్రగతిని ప్రజలకు వివరించారు.

ఈ కార్యక్రమంలో కొడవలూరు టిడిపి అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, టిడిపి నాయకులు మందపాటి రమణారెడ్డి, సిద్దార్థ, బాబ్జి, ఎల్లం దయాకర్ నాయుడు, టిడిపి ఉపాధ్యక్షులు కరకట్ట మల్లికార్జున, టిఎన్‌టియుసి నాయకులు ఆరె విల్సన్, మండల ఎస్సి సెల అధ్యక్షులు కరకట్ట సోమేశ్వ రరావు, మహిళా నాయకురాలు మల్లి లక్ష్మి టిడిపి క్లస్టర్, మరియు యూనిట్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

# పేదల అవసరాలు గుర్తించే పాలకుడు చంద్రబాబు నాయుడు

**- అధికారంలోనికి వచ్చిన 15 నెలలలో ఒక్క కోవూరు నియోజకవర్గంలోనే సిఎంఆర్ఎఫ్ ద్వారా 362 మంది అనారోగ్య పీడితులకు దాదాపు 4 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం అందించాం - యల్లాయపాళెం గ్రామంలో సిసి రోడ్డు ప్రారంభోత్సవం - 15 నెలల వ్యవధిలో యల్లాయపాళెం పంచాయతీలో 1 కోటి 50 లక్షల అభివృద్ధి పనులు చేసాం - ఎన్టీఆర్ నగర్ వద్ద గ్రావెల్ గుంతలకు 3 లక్షలు వెచ్చించి ఫెన్సింగ్ ఏర్పాటు - రామాపురంను ప్రత్యేక పంచాయతీగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపాం : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**







**నెల్లూరు ప్రతినిధి, (రాజధాని వార్తలు):**పలెటూళ్ళల్లో పట్టణ స్థాయి మౌళిక వసతులు కల్పించి గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. కొడవలూరు మండలం యల్లాయపాళెం గ్రామ పంచాయతీలోని ఎన్టీఆర్ నగర్‌లో 11 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభో త్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి స్థానిక టిడిపి నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ నగర్ సమీపంలో చెరువులను తలపిస్తున్న గ్రావెల్ గుంత లకు 3 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రొటెక్షన్ ఫెన్సింగ్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఎన్టీఆర్ నగర్‌కు వచ్చినప్పుడు గ్రావెల్ గుంతలలో పడి ఇద్దరు చిన్నారులతో పాటు పశువులు కూడా మృతి చెందాయని స్థానికులు చెప్పడంతో చలించిపోయానన్నారు. పిల్లలను ఆడుకునేందుకు బయటకు పంపాలంటేనే తల్లి తండ్రులు భయపడే పరిస్థితి వుండేదన్నారు. ఎన్నికలలో గెలిచాక గ్రావెల్ గుంటలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తా నని హామీ యిచ్చానని ఎన్టీఆర్ నగర్ వాసుల ప్రాణాంతకంగా మారిన గ్రావెల్ గుంటలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసాక సంతోషంగా ఉందన్నారు. యల్లాయపాళెం పంచాయతి పరిధిలోని రామాపు రంను ప్రత్యేక పంచాయతీగా అప్ గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 15 నెలలలో దాదాపు 1 కోటి 50 లక్షలతో యల్లాయపాళెం గ్రామ పరిధిలో రోడ్లు, డ్రైన్లు లాంటి మౌలిక వసతులు కల్పిం చామన్నారు. ఎన్నికల సందర్భంగా యల్లాయపాళెం గ్రామ అభివృద్ధికి సంబంధించి చేసిన ప్రతి హామీని దశల వారీగా అమలు చేసుకుంటూ పోతున్నామన్నారు. అభివృద్ధి సంక్షేమం సమపాళ్లలో అమలు చేయడం చంద్రబాబు నాయుడు గారికే సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం లోనికి వచ్చాక 3 వేలు వున్న వృద్ధాప్య పెన్షన్ 4 వేలు, దివ్యాంగుల పెన్షన్ రెట్టింపు ఏడాదికి ఉచితంగా 3 సిలెండర్లు, అన్నదాత సుఖీభవ, మత్స్యకార సేవలో, తల్లికి వందనం యిలా ఎన్నికలకు ముందు చేసిన హామీలలో 95 శాతం సంక్షేమ పథకాలు అమలు చేసిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఉద్యోగాలు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే మహిళలు, విద్యార్థినుల పాలిట స్త్రీశక్తి పేరిట ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణ పథకం ఓ వరమని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అభివర్ణించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో సోదరులు నష్టపోకుండా ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏడాదికి 15 వేలు ఆర్థిక సహాయం అందచేశా మన్నారు. అధికారంలోనికి వచ్చిన 16 నెలలలో ఒక్క కోవూరు నియోజకవర్గంలోనే సిఎంఆర్ఎఫ్ ద్వారా 362 మంది అనారోగ్య పీడితులకు దాదాపు 4 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం అందించిన కూటమి ప్రభుత్వం పేదల ఆకాంక్షలు నెరవేర్చే మంచి ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టి మండల అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు అమరేంద్ర రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, సొసైటీ ఛైర్మెన్ ఏకొల్లు వంశిరెడ్డి, ఎంపీటీసీ గరికపాటి రాజా, డిస్ట్రిబ్యూటర్ కమిటి ఉపాధ్యక్షులు జొన్న శివకుమార్ టిడిపి నాయకులు భూలోకం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అమరనాథ్ అలంకారంలో విశ్వేశ్వరస్వామి : పీఠాధిపతులు శ్రీ రాజరాజేశ్వరానంద స్వామి




**సంగం, (రాజధాని వార్తలు):** సంగం తిరుమన కొండలో వెలసి ఉన్నశ్రీరాజరాజేశ్వరి దేవి సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి జ్ఞాన పీఠంలో లోకకళ్యాణం కొరకు 45 రోజులు లలితా రుద్రమహాయజ్ఞం 17వ రోజు శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వారికీ అమరనాథ్ అలంకారము పంచ సూక్తసహిత రుద్రాభిషేకం వైభవంగా పీఠాధిపతులు శ్రీ రాజరాజేశ్వరానంద స్వామి పేర్కొన్నారు. ఈ సందర్భముగా పీఠాదిపతులు శ్రీ రాజరాజేశ్వరానంద స్వామి భక్తులకు జ్ఞాన బోధ చేసినారు. పరమేశ్వరుడు, పరమేశ్వరి కాశీ విశ్వేశ్వరుడుగా విశాలాక్షి. అన్నపూర్ణగా కాశీ పట్టణమును రాజధానిగా ప్రపంచాన్ని పాలచేసినారని, శివపార్వతులు విశ్వమంతా పరమాణువుల రూపములో అరుగ కాంతితో శ్రీ రాజరాజేశ్వరి స్వరూపములో ప్రపంచాన్ని పరిపాలన చేస్తున్నారని భగవంతుని నవ భక్తితో సేవించవచ్చని పూజ, యజ్ఞం, ధ్యానం, జపం, ప్రాణాయామం ద్వారా మోక్షం పొందవచ్చుని స్వామి వివరించారు.

# దీపావళి మందులు నిల్వ ఉంటే కేసు నమోదులే : ఎస్సై ఎం.శివ

**దర్శి, (రాజధాని వార్తలు):** కురిచేడు మండల కేంద్ర పరిధిలో దీపావళి మందులు నిల్వ ఉంటే కేసు నమోదు చేస్తామని ఎస్సై ఎం శివ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. దీపావళి టపాసులు లైసెన్స్‌లు లేకుండా తమ ఇళ్లల్లో నిల్వ పెట్టుకుంటే అనుమానం ఉన్న ఇళ్లల్లో తనిఖీలు నిర్వహిస్తామని, అదేవిధంగా బాణ సంచాలు నిల్వ ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన మాట్లాడారు. దీపావళి టపాసులు అమ్మాలంటే లైసెన్స్‌లు కంపల్సరీ ఉండాలని అలా లేనిచో కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచడం జరుగుతుందని పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.




# జీఎస్టీపై ప్రచారం - వ్యాపారులు, వినియోగదారుల్లో అవగాహన : ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** జీఎస్టీ (గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్) విధానం వలన సామాన్యులకు కూడా మేలు చేకూరుతుందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణం లోని పోలేరమ్మ గుడి వద్ద నుండి పాత బస్టాండ్ సెంటరు వరకు నిర్వహించిన జీఎస్టీ సూపర్ సేవింగ్స్ – అవగాహన ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కురుగొండ్ల రామ కృష్ణ మాట్లాడుతూ, "జీఎస్టీ వల్ల ధరలలో పారదర్శకత పెరిగి వినియోగదారులకు న్యాయమైన ధరలు లభిస్తాయి.

మధ్యతరగతి ప్రజలు స్థానికంగా కొనుగోలు చేస్తే మరింత సేవింగ్స్ సాధిం చవచ్చు" అని వివరించారు. పన్నుల సరళీకరణ ద్వారా ఉత్పత్తుల ధరలు తగ్గే అవకాశముం దని, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపారుల సంక్షేమం దృష్టిలో పెట్టుకున్నాయని ఎమ్మెల్యే రామకృష్ణ వివరించారు. ర్యాలీలో భాగంగా వ్యాపారులకు, కొనుగోలుదారులకు జీఎస్టీపై కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు లఘు ఉపన్యాసాలు నిర్వహించారు. ప్రజల్లో వాస్తవ అవగాహన పెంచి ఆదాయాన్ని పొదుపు చేయడమే లక్ష్యంగా ఈ ర్యాలీని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు ప్రభుత్వం అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని జీఎస్టీ విధానాన్ని మరింత ప్రజాను కూలంగా రూపొందిస్తోంది. దీన్ని సద్వినియోగం చేసుకుంటే ప్రతి కుటుంబానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ మేలు లభిస్తుంది అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ విశ్వనాథం, పట్టణ అధ్యక్షులు, అవ్వారు సత్యనారాయణ, మాజీ ఏఎంసీ ఛైర్మన్ రాజేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బీరం రాజేశ్వరరావు, జనసేన మహిళ నాయకురాలు రాధమ్మ, టిడిపి నేతలు జానపాటి మురళి, సామల లక్ష్మీపతి, మంకు ఆనంద్ మరియు టిడిపి కార్యకర్తలు జనసేన నేతలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్, ఎస్పీను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**కోవూరు, (రాజధాని వార్తలు):** జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ హిమాన్షు శుక్లా ఎస్పి అజిత వేజెండ్లను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌తో భేటీ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. జిల్లా ఎస్పి అజిత వేజెండ్లకి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపిన అనంతరం నియోజక వర్గ పరిధిలో శాంతి భద్రతలపై చర్చించారు.

# ఘనంగా బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీ రామశర్మ 101వ జయంతి వేడుకలు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక పుర మందిరమున వర్ధమాన సమాజ భవనమున నందు బుధవారం సాయంత్రం 6 గంటలకు డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సభకు చీరాల వాస్తవ్యులు డాక్టర్ అన్నదానం చిదంబర శాస్త్రి విశిష్ట అతిథిగా ఉండి జానకీ రామశర్మ గ్రంథము త్రిపుర రహస్య్జ్ఞానఖండ సారము గూర్చి వివరించారు. శర్మ వ్రాసిన గ్రంథము ఉపదేశామృత తరంగిణి గ్రంథావిష్కరణ జరిగినది. మరో విశేషము ఈ సంవత్సరము శర్మ పేరిట ఏర్పరచిన స్మారక పురస్కారం 2025 నెల్లూరు వాస్తవ్యులైన విద్యా వారిధి, మహామహోపాధ్యాయ బ్రహ్మశ్రీ చింతలపాటి పూర్ణానంద శాస్త్రి విశ్రాంత ప్రధానాచార్యులు వేద సంస్కృత కళాశాల మూలపేట నెల్లూరు, అందజేయడమైనది. విశిష్ట అతిథికి సన్మానం, అధ్యక్షులకి సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి జానకీరామశర్మ కుటుంబ సభ్యులు చతుర్వేదుల నరసింహ మూర్తి, జ్యోత్స్న మీనాక్షి, రామ శేషు, పెయ్యేటి మురళి కృష్ణ, వంశీ కృష్ణ, మద్దాలి లక్ష్మీ, వాణి, తదితరులు పాల్గొన్నారు. నగరంలో పలువురు సాహితీ ప్రియులు నలుబోలు బలరామయ్య నాయుడు, గిరిజా లక్ష్మీ, డాక్టర్ రామకృష్ణప్రసాద్, తూమాటి సంజీవరావు పాల్గొన్నారు. సభా నిరాహకులు వేదం వేంకట రాధా కృష్ణచే వందన సమర్పణ చేయడంతో సభ ముగిసినది.

# వాడవాడల మాన్యశ్రీ కాన్షీరామ్ 19వ వర్ధంతి



**ఉప్పలగుప్తం, (రాజధాని వార్తలు):** బహుజన్ సమాజ్ పార్టీ బిఎస్‌పి వ్యవస్థాపకలు మాన్యశ్రీ కాన్సీరామ్ 19వ వర్ధంతి మండలంలో పెద్దూరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద గ్రామ పెద్దలు గ్రామస్తులు మహిళలు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బహుజన సమాజ్ పార్టీ బిఎస్‌పి అమలాపురం నియోజకవర్గ ఇంచార్జ్ పొలమూరి మోహన్ బాబు పాల్గొని అంబేద్కర్ ఆలోచన విధానం మాన్యశ్రీ కాన్సిరాం భుజాన వేసుకుని భారతదేశంలో దళిత గిరిజన మైనారిటీ వర్గాలకు రాజ్యాధికారం ఫలాలను అందించిన మహా మేధావి అని ఆయన ఆశయాలు మనందరం కొనసాగించాలని రాజ్యాధికార సాధన దిశగా అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొంకి మునీంద్ర నందిక కృష్ణమూర్తి, అయితాబత్తుల వెంకట్రావు (పాస్టర్), గుదే శ్రీనివాస రావు అయితాబత్తుల ఈశ్వరరావు, కొంక విజయ్ కుమార్ పొద్దోకు నాగేంద్ర, పొద్దోకు భద్ర, తాళ్ల బాబ్జి, తాళ్ల భీమారావు కందికట్ల సరస్వతి చిక్కురుమిల్లి సత్యవతి కొంకి సత్యవతి, గుదే నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు అండగా ఉంటాం

## - ప్లాంట్‌ను కాపాడుకోవడమే వైయస్సార్‌సీపీ లక్ష్యం : వైయస్ జగన్ స్పష్టీకరణ

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** నర్సీపట్నం పర్యటనలో భాగంగా విశాఖపట్నంలో రోడ్డు మార్గంలో వెళ్తుండగా, మాజీ సీఎం, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. స్టీల్ ప్లాంట్‌ను కాపాడతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన టీడీపీ కూటమి, ఆ తర్వాత తమను మోసం చేస్తోందని వారు తెలిపారు. ప్లాంట్‌ను ఎలాగైనా కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల విజ్ఞప్తిపై వైయస్ జగన్ సానుకూలంగా స్పందించారు. తాము అధికారంలో ఉన్నా, విపక్షంలో ఉన్నా..ఎప్పుడూ తమ వైఖరి ఒక్కటేనని, అది విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోవడమే అని ఆయన స్పష్టం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ స్టీల్ ప్లాంట్ కార్మికులకు తోడుగా ఉంటుందని, ప్లాంట్ ప్రైవేటీకరణ కాకూడదన్నదే తమ లక్ష్యమని తేల్చి చెప్పారు. ఆ దిశలో కృషి చేస్తామని స్టీల్ ప్లాంట్ కార్మికులకు వైయస్ జగన్ హామీ ఇచ్చారు. కాగా, విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు ప్రధానంగా మూడు డిమాండ్లు



ప్రభుత్వం ముందు ఉంచుతున్నారు. స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలి. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేకంగా గనులు కేటాయించాలి. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి. సంస్థలో తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి. ఈ డిమాండ్లతో విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు ఆందోళనకు దిగుతున్నారు.

# ఇండస్ట్రియల్ హబ్‌గా కరేడు

## - పోర్టు ఆధారిత పరిశ్రమలతో ఉపాధి, ఉద్యోగావకాశాలు
## - వేగవంతంగా భూసేకరణ - 515 ఎకరాలకు అవార్డు పాస్ : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పోర్టు ఆధారిత పరిశ్రమల రాకతో కరేడు గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయని, ఇక్కడ ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మొత్తం 4800 ఎకరాల భూసేకరణ అవసరం కాగా ఇప్పటివరకు 515 ఎకరాలకు సంబంధించి రైతులకు అవార్డు పాస్ చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో మరింత వేగంగా భూసేకరణ కొనసాగిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. భూసేకరణకు ప్రభుత్వానికి సహకరిస్తూ మన ప్రాంతాల అభివృద్ధికి ముందుకొస్తున్న రైతులకు కలెక్టర్ ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్షంగా వేలాది ఉపాధి, ఉద్యోగాలు స్థానిక యువతకు లభించనున్నాయి. పరోక్షంగా అనేక ఉపాధి అవకాశాలు వ్యాపారాలు, రవాణా, సేవా రంగాల్లో ఏర్పడతాయి. ఇది కేవలం కరేడుకు మాత్రమే కాకుండా, మొత్తం జిల్లాకు ఒక పెద్ద ఆర్థిక బలం కలిగించనుంది.

**భూములు కోల్పోయిన వారికి భరోసా**


పరిశ్రమల కోసం తమ భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందిస్తోంది. సంతృప్తికరమైన నష్టపరిహారం, పునరావాసం, పునరుద్ధరణ చర్యలతో భూములు ఇచ్చిన కుటుంబాలకు తగిన భద్రతతో పాటు భరోసా కల్పిస్తోంది. గతంలో 397 ఎకరాలకు అవార్డు పాస్ చేయగా, తాజాగా మరో 118 ఎకరాల భూములకు సంబంధించి రైతులకు అవార్డు పాస్ చేసినట్లు చెప్పారు. మొత్తం 515 ఎకరాలకు అవార్టు ప్రక్రియ పూర్తయినట్లు చెప్పారు.

**మన గ్రామాల సమగ్ర అభివృద్ధి**

ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త నాంది పలుకనుంది. రోడ్లు, విద్యుత్, నీరు వంటి మౌళిక వసతులు మరింత మెరుగుపడతాయి. దీనితోపాటు చిన్న చిన్న వ్యాపారాలు, స్టార్టప్ కంపెనీలు కూడా వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు లభించడం ద్వారా వారు పరిశ్రమల్లో ఎక్కువగా ఉద్యోగాలు పొందుటకు అవకాశాలు కలవు. కరేడు గ్రామంలో ప్రారంభమైన ఈ భూసేకరణ భవిష్యత్తు తరాల కోసం ఒక అభివృద్ధి పథం. పరిశ్రమల రాకతో వేలాది కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు జీవనోపాదికి స్థిరపడతాయి. రైతులకు నష్టపరిహారం అందించడంతో పాటు, ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా ప్రభుత్వం సమగ్రాభివృద్ధికి కృషి చేస్తోందని కలెక్టర్ అన్నారు.

# అశ్వాపురంలో తహసిల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు - ఎన్నికల కోడ్ అమలు పర్యవేక్షణ





**అశ్వాపురం, (రాజధాని వార్తలు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐఏఎస్ గురువారం అశ్వాపురం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం మరియు ఎంపీడీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులు, హాజరు పుస్తకాలు, ప్రజా సేవల అమలు విధానాలు, సిబ్బంది హాజరు వంటి అంశాలను సమీక్షించారు. పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలందించాలంటూ అధికారులకు సూచనలు చేశారు. తరువాత ఆయన అశ్వాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల 2025 నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. ఎంతటి వారైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. ఈ తనిఖీ మరియు పర్యవేక్షణ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సూపర్ జీఎస్టీతో ఆరోగ్య పాలసీలలో సానుకూల మార్పులు

## - నియోజకవర్గ ప్రత్యేక అధికారిని ప్రమీల గాంధీ, ఎం.పీ.డీ.వో బి.కళ్యాణి, బెల్లాన హాస్పిటల్స్ చైర్మన్ లయన్ బెల్లాన లక్ష్మి





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం బెల్లాన హాస్పిటల్స్‌లో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారిని ప్రమీల గాంధీ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీతో ఆరోగ్య పాలసీలలో సానుకూల మార్పులు చోటు చేసుకున్నాయని ఆమె అన్నారు.

ఆరోగ్య పాలసీలపై జిఎస్టి తగ్గడంతో తక్కువ ప్రీమియంతోనే ఆరోగ్య బీమా పాలసీలు పొందే అవకాశం లభించడం ప్రజలకు మరింత ఉపశమనం కలిగిస్తుందని ఆమె చెప్పారు. ఎం.పీ.డీ.వో బి.కళ్యాణి మాట్లాడుతూ జి ఎస్ టి తగ్గిం పుతో వైద్య రంగంలో బడుగు, బలహీన పేద ప్రజలకు సానుకూలంగా అనేక మార్పులు జరుగుతున్నాయని అన్నారు. సూపర్ జి ఎస్ టి - సూపర్ సేవింగ్ ప్రచారంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మరియు ప్రైవేట్ హాస్పిటల్స్‌లో జీఎస్టీ ద్వారా ఆరోగ్య రంగానికి కలిగిన ప్రయోజనాలను ఆమె వివరించారు. లయన్ బెల్లాన లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యంగా ఆరోగ్య పాలసీలపై జిఎస్టి 18% నుంచి 0%కి తగ్గటంతో సాధారణ ప్రజలకు గణనీయమైన మేలు జరుగుతుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో జనార్ధన్ రావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఈ అధర్మదాడికి జవాబుదారీ ఎవరు?

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పైకి బూటు విసిరిన న్యాయవాది పేరు రాకేశ్ కిశోర్ కాకుండా రహీమ్ ఖాన్ అయి ఉంటే ఏమి జరిగి ఉండేది? ఆసక్తికరమైన ప్రశ్న, సందేహం లేదు. పాల్పడిన అపరాధానికి శిక్షించకుండా అతడిని వదిలివేయడం జరిగేది కాదు. జాతీయ భద్రతా చట్టం, (కశ్మీరీ ముస్లిం అయి ఉంటే) ప్రజా భద్రత చట్టం, బహుశా, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద కూడా అతడు తప్పక అభియోగాలను ఎదుర్కోవలసివచ్చేది. నాగరిక సంస్కారం లోపించిన ప్రజాభిప్రాయం నేర న్యాయ విచారణ ప్రక్రియను ప్రభావితం చేయగల విద్వేషపూరిత, సంకుచిత సంఘర్షణలు ప్రబలంగా ఉన్న సామాజిక పర్యావరణ వ్యవస్థపై దృష్టి పెట్టేలా ప్రజలను పురిగొల్పేందుకే నేను ఆ ప్రశ్నను సంధించాను. సీజేఐపై బూటు దాడికి దారితీసిన ఘటనల క్రమాన్ని నిశితంగా చూద్దాం. ఖజురహోలోని ఒక ఆలయంలో విరిగిన విష్ణుమూర్తి ప్రతిమ నొకదానికి పూర్వ వైభవాన్ని పునరుద్ధరించేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ఒక పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి గవాయ్ కొట్టివేశారు. ఆ సందర్భంగా 'ఇది, ప్రచార కండూతితో దాఖలు చేసిన పిటిషన్' అని సీజేఐ వ్యాఖ్యానించారు. 'పిటిషనర్ విష్ణువుకు భక్తవరేణ్యుడు అయితే ఆయనే దేవుడిని ప్రార్థించాలి, కొంచెం ధ్యానం చేయాలి' అని కూడా గవాయ్ అన్నారు. ఒక విధంగా వెటకారం ధ్వనిస్తున్నట్టుగా ఉన్న ఆయన మాటలు పూర్తిగా అనవసరమైనవి. అయితే అవి విచారణలో యథాలాపంగా చేసిన వ్యాఖ్యలు మాత్రమే అని గుర్తుంచుకోవాలి. ఖజురహోలో విష్ణు ప్రతిమ పునఃప్రతిష్ఠాపన కోర్టు పరిధిలోని అంశం కాదని, దానిపై నిర్ణయం తీసుకోవల్సింది భారత పురావస్తు సర్వే అని స్పష్టం చేస్తూ సుప్రీంకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. సర్వోన్నత న్యాయస్థానం సహేతుక తీర్పులు చదివే విజ్ఞత, సామాజిక మాధ్యమాల్లో చెలరేగిపోతుండే రాజకీయ, సైద్ధాంతిక సేనా శ్రేణులకు దురదృష్టవశాత్తు పూర్తిగా కొరవడింది. ఖజురహో విష్ణుమూర్తి విగ్రహంపై సీజేఐ వ్యాఖ్యలు మితవాద రాజకీయ, సైద్ధాంతిక బృందాల నుంచి అనియంత్రిత ఆగ్రహావేశాల ప్రతిస్పందనలను వెల్లువెత్తించాయి. దేశ పాలకుల అండదండలు ఉన్నందునే ఈ మితవాద శ్రేణులు అలా రెచ్చిపోయాయి. వ్యూహాత్మకంగా వెల్లువెత్తిన ఈ 'ప్రజాగ్రహం'తో తన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వడం సీజేఐకి అనివార్యమయింది. 'తాను మతాలను విశ్వసిస్తానని, అన్ని మతాల ఆరాధనా మందిరాలను సమరీతి భక్తి ప్రపత్తులతో సందర్శిస్తుంటానని, 'నిజమైన లౌకికవాదం'లో తనకు సంపూర్ణ నమ్మకం ఉందని' గవాయ్ అన్నారు. అయితే ఈ వివరణ సామాజిక మాధ్యమాలలో ఆయనపై తీవ్ర విమర్శలు చేస్తున్న కరడుగట్టిన మితవాదులను సంతృప్తిపరచలేదు. సరికదా మరింత తెగింపుతో మీమ్‌లు, హ్యాష్ ట్యాగ్‌లు, యూట్యూబ్ వీడియోలతో సీజేఐ గవాయ్‌పై తమ దాడిని కొనసాగించారు. ఈ ఆవేశపూరిత వాతావరణంలో 71 సంవత్సరాల సీనియర్ న్యాయవాది రాకేశ్ కిశోర్, సుప్రీంకోర్టులో సీజేఐ గవాయ్‌పై బూటును విసిరివేయడం ద్వారా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేయదలుచుకున్నాడు. 'సనాతన్ ధర్మ కా అప్మాన్, నహి సహేగా హిందుస్థాన్!' (సనాతన ధర్మానికి అవమానం కలిగితే భారతదేశం సహించదు) అని వ్యాఖ్యానించాడు. తనపై దాడి పట్ల జస్టిస్ గవాయ్ సంయమనంతో వ్యవహరించి, విచారణ విధులు కొనసాగించారు. బూటు విసిరిన సనాతనవాదిపై కేసు దాఖలు చేసేందుకు తిరస్కరించారు. తన అనాగరిక చర్యపట్ల రాకేశ్ కిశోర్‌లో ఎలాంటి పశ్చాత్తాపం లేదు. తనకు లభించిన 'ప్రఖ్యాతి'కి ఆనందిస్తూ 'అటువంటి పని మళ్లీ చేస్తాను' అని కూడా రాకేశ్ కిశోర్ అన్నాడు. ఈ మహాశయుడిపై స్వయంగా చర్య చేపట్టవలసిన ఢిల్లీ పోలీసులు సీజేఐపై బూటు దాడి వ్యవహారంలో జోక్యం చేసుకోకుండా మిన్నకుండిపోయారు. దీంతో కోర్టు ధిక్కారానికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిశోర్ మరింత నిర్భయంగా ఏవేవో మాట్లాడడం కొనసాగిస్తున్నారు. తన చర్యను సమర్థిస్తున్న వారి నుంచి మరింతగా ప్రశంసలు అందుకుంటున్నారు. సమాజ జీవితం నుంచి బహిష్కరణకు గురికావల్సిన అపరాధికి ఇటువంటి వైభవం లభించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? సీజేఐపై దాడిపట్ల న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ మౌనంగా ఉండిపోయారు. బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఘటన సంభవించిన ఎనిమిది గంటల అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిస్పందించారు. 'ఈ ఉదయం సుప్రీంకోర్టు ప్రాంగణంలో భారత ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి పట్ల ప్రతి భారతీయుడూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. మన సమాజంలో ఇలాంటి అనాగరిక చర్యలకు తావులేదు. ఇది పూర్తిగా ఖండించదగినది' అని ప్రధానమంత్రి ట్వీట్ చేశారు. స్వాగతించాల్సిన మాటలు, సందేహం లేదు. అయితే ఈ సందర్భంలో ఒక పాత విషయాన్ని గుర్తు చేసుకోవల్సిన అవసరమున్నది. 2019లో నాథూరామ్ గాడ్సేను బీజేపీ ఎంపీ ప్రగ్యాసింగ్ ఠాకూర్ కొనియాడారు. దీనిపై మోదీ ఆవేదన వ్యక్తం చేస్తూ ఆమెను పూర్తిగా క్షమించలేనని అన్నారు. అయితే ఆ బీజేపీ ఎంపీపై ప్రభుత్వం గానీ, పార్టీ గానీ ఎలాంటి చర్య తీసుకోలేదు. మరింత గందరగోళానికి ఆస్కారమివ్వకుండా ప్రగ్యా ఠాకూర్ తన పార్లమెంటు సభ్యత్వ కాలాన్ని పూర్తి చేశారు. ఆమె హిందూత్వ భావజాల అనుయాయి. కనుకనే గాడ్సేను మెచ్చుకోవడానికి వెనుకాడలేదు. ఆ మాటకు వస్తే సంఘ్ పరివార్ ఇప్పటికీ గాడ్సే ఆరాధన నుంచి తనను తాను దూరం చేసుకోలేదు. తాను సనాతన ధర్మ 'రక్షకుడు'నని చెప్పుకున్న రాకేశ్ కిశోర్ కూడా సంఘ్ పరివార్ భావజాల వ్యవస్థలో భాగమే కదా. మహాత్ముడిని హతమార్చేందుకు గాడ్సే తుపాకీ పేల్చగా రాకేశ్ కిశోర్ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేసేందుకు సాపేక్షంగా మృదు ఆయుధమైన ఒక బూటును ఉపయోగించుకున్నాడు.

## శ్రీశ్రీ ముత్యాలమ్మకు పసుపు నీళ్లతో అభిషేకం



**వెంకటగిరి, (రాజధాని వార్తలు):** ఎన్టీఆర్ కాలనీలోని శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద 6వ వార్షికోత్సవ మహోత్సవము సందర్భంగా ముత్యాలమ్మ అమ్మవారి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేకమైన పూజా కార్యక్రమాలు 11వ తేదీ శనివారము ఉద యం 9 గంటలకు గణపతి పూజ హోమము అదేవిధంగా ఉదయం 10 గంటలకు అమ్మవారికి పసుపు నీళ్లతో అభిషేకము, ఉదయం 11 గంటలకు అమ్మవారికి ప్రత్యేకమైన అలంకరణ, అర్చన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాదం పంపిణీ కార్యక్రమంతో పాటు రాత్రి 7 గంటలకు అమ్మవారికి కుంకుమతో అర్చన అదేవిధంగా రాత్రి 8 గంటలకు అమ్మవారికి హారతి మరియు భక్తులకు అమ్మవారి ప్రసాదం వినియోగము కార్యక్రమాలకు పాల్గొని ముత్యాలమ్మ అమ్మవారి కృప కటాక్షం పొందాలని దేవస్థానం నిర్వాహకులు నరేష్ రెడ్డి, సుకుమార్ రెడ్డి మరియు ప్రధాన అర్చకులు తెలిపారు.

## వి.ఐ.టి.-ఏ.పి స్టార్స్ విద్యార్థులకు ఉచిత ల్యాప్‌ట్యాప్‌ల పంపిణి




**అమరావతి, (రాజధాని వార్తలు):** గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నత చదువులకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశ్యంతో విఐటి వ్యవస్థాపకుడు డా.జి.విశ్వనాథన్ సంకల్పం మేరకు విశ్వవిద్యాలయంలో STAR అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించామని విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డా.ఎస్.వి. కోట రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ కళాశాలలలో ఇంటర్ చదివి జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థులు (26 జిల్లాల నుండి ఒక విద్యార్థి, విద్యార్థిని) చొప్పున ఎంపిక చేసి విఐటి -ఏపి విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యతో పాటు వసతిని, ప్రాథమిక వైద్యం పూర్తి ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 50 మంది విద్యార్థులకు ఉచిత laptops ని పంపిణి చేసారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ స్టార్ పథకం సమ్మిళిత విద్య మరియు సమాజ అభివృద్ధిలో తమ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలియచేసారు. అర్హతగల విద్యార్థులకు మద్దతు ఇవ్వడం ద్వారా, మేము వారి భవిష్యత్తును రూపొందించడమే కాకుండా సమాజం యొక్క అభివృద్ధి మరియు పురోగతికి కూడా దోహదపడతామని విశ్వాసిస్తునట్లు తెలిపారు. విద్యార్థులు ఈ ప్రోగ్రాం ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా.డి.వెంకట లక్ష్మి (స్టార్స్ కోఆర్డినేటర్), విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యప్రదేశ్ ట్రావెల్ మార్ట్ 2025: మధ్యప్రదేశ్‌లో జరగనున్న పర్యాటక మహాకుంభ్

**- మధ్యప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తారు : రాష్ట్ర మంత్రి శ్రీ లోధి**

**- అక్టోబర్ 11 నుండి 13 వరకు భోపాల్‌లో మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు ఒక కార్యక్రమాన్ని నిర్వహించనుంది**



**భోపాల్:** మధ్యప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా స్థాపించే లక్ష్యంతో, ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ నాయకత్వంలో, మధ్యప్రదేశ్ ట్రావెల్ మార్ట్ 2025 అక్టోబర్ 11 నుండి 13, 2025 వరకు భోపాల్‌లోని కుషాభావు ఠాక్రే అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతుంది. ఈ కార్యక్రమం దేశీయ మరియు అంతర్జాతీయ కొనుగోలుదారులు, విక్రేతలు, ట్రావెల్ ఏజెంట్లు, చలనచిత్ర ప్రతినిధులు మరియు పర్యాటక పరిశ్రమలోని అన్ని వాటాదారులను ఒకే వేదికపైకి తీసుకు వస్తుంది. మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు నిర్వహించే ఈ మూడు రోజుల కార్యక్రమంలో 27 దేశాల నుండి 80 మందికి పైగా విదేశీ టూర్ ఆపరేటర్లు, 150 మంది దేశీయ టూర్ ఆపరేటర్లు, 355 మంది విక్రేతలు, చలనచిత్ర ప్రతినిధులు మరియు మీడియాతో సహా 700 మందికి పైగా పాల్గొంటారు. ఇది భారత దేశంలోనే అతిపెద్ద రాష్ట్ర స్థాయి ట్రావెల్ మార్ట్ అవుతుంది, ఇది మధ్యప్రదేశ్‌ను "ఇన్‌క్రెడిబుల్ ఇండియా హృదయం"గా ప్రపంచ వేదికపై ప్రదర్శిస్తుంది. పర్యాటక, సంస్కృతి, మతపరమైన దేవాదాయ మరియు దేవాదాయ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) ధర్మేంద్ర భావ్ సింగ్ లోధి మాట్లాడుతూ, ఇది FICCI సహకారంతో నిర్వహించబడే దేశంలోనే అతిపెద్ద రాష్ట్ర స్థాయి ట్రావెల్ మార్ట్‌లలో ఒకటి అవుతుందని అన్నారు. ఇది మన రాష్ట్రంలోని హోటళ్ల యజమానులు, ట్రావెల్ మరియు టూర్ ఆపరేటర్లు, హోమ్‌స్టే ఆపరేటర్లు మరియు పర్యాటక వాటాదారులను, విక్రేతలు అని పిలుస్తారు, ప్రముఖ విదేశీ మరియు దేశీయ హోటళ్ల యజమానులు, ట్రావెల్ మరియు టూర్ ఆపరేటర్లు, కొనుగోలుదారులు అని పిలుస్తారు. ఇది మధ్యప్రదేశ్‌లో పర్యాటకుల రాకను పెంచడమే కాకుండా పర్యాటక రంగంలో ఆర్థిక వృద్ధికి తలుపులు తెరుస్తుంది, స్థానిక ఉపాధిని పెంచుతుంది. ఈ కార్యక్రమం పర్యాటకం, ఆతిథ్యం, సినిమా, వివాహం మరియు MICE రంగాలలో పెట్టుబడి, భాగస్వామ్యాలు మరియు సహకారాలకు అవకాశాలను అందిస్తుంది. ఈ కార్యక్రమంలో 3,000 కంటే ఎక్కువ B-2B సమావేశాలు జరుగుతాయి, ఇది ఇప్పటివరకు మధ్యప్రదేశ్ పర్యాటక రంగంలో జరిగిన అతిపెద్ద వ్యాపార పరస్పర చర్య. అదనంగా, పర్యాటకం మరియు చలనచిత్ర పరిశ్రమలకు సంబంధించిన అంతర్జాతీయ సమావేశాలు మరియు రౌండ్ టేబుల్ సెషన్‌లు ఉంటాయి, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు వివాహ మరియు కార్పొరేట్ నిర్వాహకులతో నేపథ్య చర్చలు ఉంటాయి. పర్యాటక మంత్రిత్వ శాఖ మరియు వివిధ రాష్ట్రాల పర్యాటక శాఖల సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

**ప్రపంచ వేదికపై మధ్యప్రదేశ్ పర్యాటకాన్ని స్థాపించే దిశగా ఒక ప్రధాన అడుగు**

మధ్యప్రదేశ్ ట్రావెల్ మార్ట్ 2025 ద్వారా, రాష్ట్రం దాని గొప్ప పర్యాటక ఉత్పత్తులను - వారసత్వం, వన్యప్రాణులు, గ్రామీణ సంస్కృతి, హస్తకళలు, ఆహారం మరియు చలనచిత్ర పర్యాటకాన్ని - ఒకే వేదికపై ప్రదర్శిస్తుందని పర్యాటక, సంస్కృతి, హోం వ్యవహారాలు, మతపరమైన ట్రస్టులు మరియు ఎండోమెంట్‌ల అదనపు ప్రధాన కార్యదర్శి శివ శేఖర్ శుక్లా పేర్కొన్నారు. గోండ్ కళ మరియు చందేరి చీరల ప్రత్యక్ష ప్రదర్శనలతో పాటు, రాష్ట్ర చేనేత మరియు హస్తకళ ఉత్పత్తులను ప్రదర్శించే 120 కి పైగా స్టాళ్లు ఏర్పాటు చేయబడతాయి. స్టేక్‌హోల్డర్ స్టాళ్లు కూడా చేర్చబడతాయి. పెట్టుబడి ప్రమోషన్, కొత్త పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పందాలు మరియు చలనచిత్ర విధానం కింద సహకార ప్రకటనలు కూడా చేయబడతాయి. ఈ కార్యక్రమంలో ప్రత్యేక సాంస్కృతిక ప్రదర్శనలు ప్రఖ్యాత నృత్య సమన్వయకర్త శ్రీమతి మైత్రేయి పహాడి దర్శకత్వంలో మధ్యప్రదేశ్ సహజ సౌందర్యం మరియు చారిత్రక వారసత్వాన్ని ప్రదర్శించే 40 నిమిషాల సమూహ నృత్య ప్రదర్శన మరియు రాష్ట్ర సంగీత గుర్తింపుకు చిహ్నంగా ఉన్న మైహార్ బ్యాండ్ ప్రత్యేక ప్రదర్శన ఉన్నాయి. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వం మరియు గిరిజన సంప్రదాయాలను పరిచయం చేయడానికి జానపద మరియు గిరిజన నృత్య ప్రదర్శనలు ప్రదర్శించబడతాయి. స్థానిక వంటకాలు మరియు సాంప్రదాయ జానపద సంస్కృతి ఈ కార్యక్రమాన్ని మరింత ఉత్సాహపరుస్తాయి. ముఖ్యమంత్రితో పెట్టుబడిదారుల చర్చ మరియు కీలక సెషన్ ఈ కార్యక్రమంలో, ముఖ్యమంత్రి డాక్టర్ యాదవ్‌తో వన్-ఆన్-వన్ పెట్టుబడిదారుల సెషన్‌లు జరుగుతాయి. పర్యాటక సామర్థ్యంపై కూడా ప్యానెల్ చర్చలు దృష్టి సారిస్తాయి, రెండు కీలక సెషన్‌లు హైలైట్‌గా ఉంటాయి. మొదటి సెషన్, "మధ్యప్రదేశ్: ఫ్రమ్ హిడెన్ జెమ్ టు గ్లోబల్ ఐకాన్", రాష్ట్ర వారసత్వం, వన్యప్రాణులు, పర్యావరణ పర్యాటకం మరియు పండుగలపై దృష్టి పెడుతుంది. రెండవ సెషన్, "మధ్యప్రదేశ్‌లో చలనచిత్ర రంగం యొక్క భవిష్యత్తు: రీల్ నుండి నిజమైన వృద్ధి వరకు", చలనచిత్ర నిర్మాణం మరియు చలనచిత్ర ఆధారిత పర్యాటక అవకాశాలను చర్చిస్తుంది. రెండు సెషన్‌లలో భారత దేశం మరియు విదేశాల నుండి నిపుణులు, పెట్టుబడిదారులు మరియు పరిశ్రమ ప్రతినిధులు పాల్గొంటారు.

**మధ్యప్రదేశ్ పర్యాటక రంగం ప్రభావం మరియు భవిష్యత్తు**

మధ్యప్రదేశ్ ట్రావెల్ మార్ట్ 2025 రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడులకు మరియు పర్యాటకం, సినిమా, వివాహం మరియు బాధ్యతాయుతమైన పర్యాటక రంగాలలో భాగస్వామ్యాలకు కేంద్రంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం ద్వారా, రాష్ట్ర బ్రాండ్ గుర్తింపు ప్రపంచవ్యాప్తంగా 27 అంతర్జాతీయ మార్కెట్లకు చేరుకుంటుంది.

ఈ కార్యక్రమం పర్యాటక రంగంలో కొత్త అవకాశాలు, పెట్టుబడులు మరియు సహకారాల కు ద్వారాలు తెరుస్తుంది. MPTM 2025 "పర్యాటకంలో ప్రపంచ చిహ్నం"గా మధ్యప్రదేశ్ గుర్తింపును స్థాపించే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా నిరూపించబడుతుంది.

## మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి



**అల్లవరం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కొమరిపాలెంలో బాణాసంచి తయారీ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడుగురు మృతి చెందిన ఘటన పట్ల అమలాపురం మాజీ ఎంపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చింత అనురాధ తీవ్ర దిగ్భ్రాంతిని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడుగురు మృత్యువాత పడటం తీవ్రంగా కలిసి వేసిందన్నారు. మృతులకు ఒక్కొక్కరికి రూ. కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. అలాగే ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించి నష్టపరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలి

**- జిఎస్టి 2.0తో ప్రజలకు ఎంతో మేలు**



**రావులపాలెం, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వం ప్రజలకు మేలు జరిగేలా సవరించిన జీఎస్టీపై అధికారులు ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన జీఎస్టీ 2.0 గురించి మండలం పరిధిలోని ఈతకోటలోని విలేజ్ హెల్త్ క్లినిక్ గ్రామీణ ఆరోగ్య కేంద్ర వద్ద గురువారం పంచాయతీ కార్యదర్శి మాడుగుల సుందర రామలక్ష్మణశర్మ అధ్యక్షత నతో నూతన జీఎస్టీపై అవగాహనా సదస్సు నిర్వహించారు. డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎమ్ శ్రీనివాసరావు గ్రామ కార్యదర్శి శర్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన జీఎస్టీలో అనేక వస్తులపై జీఎస్టీని తగ్గించి అమల్లోకి తీసుకోచ్చాయన్నారు. తగ్గిన జీఎస్టీ వివరాలను ప్రజలకు తెలియజేసి జీఎస్టీ 2.0తో ఎంతో ప్రయో జనం చేకూరనుందని ప్రజలకు వాటిపై అవగాహనా కల్పించి వినియోగించుకోవాలన్నారు. బీజేపీ కొత్తపేట అసెంబ్లీ కో కన్వీనర్ గంద్రోతు వీరగోవిందరావు మాట్లాడుతూ దేశ ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్ జీఎస్టీని నాలుగు స్లాబులను సవరించి రెండు స్లాబులకు పరిమితం చేయడం ఎంతో ముఖ్యమైన నిర్ణయమన్నారు. ఈ సంస్కరణల వల్ల ప్రజలకు అవసరమైన వస్తు సేవలు తక్కువ ధరలకు అందుబాటులోకి రావడం ప్రధాన విజయంగా నిలుస్తుందన్నారు. ప్రజలకు ప్రధాని మోదీ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన వివరిం చారు. పేదల సంక్షేమం, వ్యవసాయం, వ్యాపారం సాధారణ వినియోగదారులకు ఆర్థిక ఉపశమనం కలుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న సేవలు గురించి తెలియజేశారు. కేంద్రంలోను రాష్ట్రంలోను ఎన్డియే ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం, ప్రజల భారాన్ని తగ్గించే దిశగా ముందుకు సాగుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోసం పనిచేస్తున్నాయని తగ్గిన జీఎస్టీపై ప్రజలకు తెలిసేలా దుకాణాల షాపుల వద్ద బోర్డులను ఏర్పాటు చేయించి పూర్తి స్థాయిలో ప్రజలకు అర్థమయ్యేలా అధికారులందరు కృషి చేయాలన్నారు. వైద్యురాలు ఎమ్ఎల్‌హెచ్. పి.సుభాషిణి వైద్య ఆరోగ్య సేవలు మందుల గురించి తగ్గింపు జీఎస్టీపై మాట్లాడారు. అనంతరం నిచ్చినకోళ్ల వెంక టేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతీష్టాతాత్మకంగా తీసుకొచ్చిన జీఎస్టీలో భీమాపై జీఎస్టీ పూర్తిగా మినహాయింపు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గుత్తుల అమృత వర్షిణి, పడాల రాము, ఎస్. సుచిత, రెడ్డి దీలీప్, మహిళా పోలీస్, బేబీ. ఎ ఎన్ ఎమ్.ఎమ్ ఇందిర ప్రియదర్శని, ఎమ్ మౌనిక, పి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# అర్జున్ రెడ్డి ముద్దు రికార్డ్‌ని కిరణ్ బ్రేక్ చేస్తాడా ఏంటి?



తెలుగు సినిమాలు వసూళ్ల విషయంలో, సాంకేతిక పరిజ్ఞానం, వీఎఫ్ఎక్స్ విషయంలో బాలీవుడ్, హాలీవుడ్ సినిమాలతో పోటీ పడుతున్న ఈ సమయంలో ముద్దు సీన్స్ విషయంలో మాత్రం ఎందుకు వెనుక ఉండాలి అనుకున్నారో ఏమో కానీ వరుసగా రొమాంటిక్ మూవీస్, లిప్‌లాక్ సీన్స్ ఉన్న సినిమాలు వస్తున్నాయి. అర్జున్ రెడ్డితో ఇది మొదలైంది. విజయ్ దేవరకొండ సినిమాలో చేసిన లిప్ లాక్ సీన్స్ అప్పట్లో సంచలనంగా మారింది. ఆ తర్వాత ఆ స్థాయిలో కాకున్నా ముద్దు సీన్స్ కామన్ అయ్యాయి. తెలుగు సినిమాల్లో ముద్దు సీన్స్ కామన్ అయ్యాయి కానీ రాబోయే కిరణ్ అబ్బవరం కె ర్యాంప్ సినిమా మరోసారి ముద్దు సీన్స్ గురించి చర్చ జరిగేలా చేసే అవకాశాలు ఉన్నాయట. ఎందుకంటే కె ర్యాంప్ సినిమాలో కిరణ్ అబ్బవరం హీరోయిన్‌తో ఏకంగా 16 సార్లు లిప్ లాక్ చేశాడని అంటున్నారు. కథ బలంగా డిమాండ్ చేయడంతో తప్పలేదని అంటున్నారు. కిరణ్ అబ్బవరం కిరణ్ అబ్బవరం సినిమా అనగానే ఒక సింపుల్, మిడిల్ క్లాస్ కుర్రాడి సినిమా గుర్తుకు వస్తుంది. ఆయన ఎక్కువ శాతం అలాంటి పాత్రలే చేశాడు. అయితే ఈసారి అందుకు భిన్నంగా ఆయన సినిమా, ఆయన పాత్ర ఉండే అవకాశం ఉందని కె ర్యాంప్ సినిమా యొక్క ప్రమోషనల్ స్టఫ్‌ను చూస్తే అనిపిస్తోంది. దానికి తోడు ఈ సినిమాలో ఆయన 16 లిప్ లాక్ ముద్దులు పెట్టాడు అంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో అందరి దృష్టి సినిమాపై ఉంది. కె సినిమా సూపర్ హిట్ అయిన నేపథ్యంలో ఇప్పుడు కె ర్యాంప్ అనే టైటిల్‌తో సినిమాను తీసుకు వస్తున్నాడు. సెంటిమెంట్ వర్కౌట్ అయ్యి సినిమా హిట్ అవుతుందేమో అనే నమ్మకంతో కిరణ్ అబ్బవరం ఉన్నాడు. అంతే కాకుండా సినిమాలో తన పాత్రను గతంలో ఎప్పుడూ చూడని విధంగా ప్లాన్ చేసుకున్నాడని, ఇలాంటి ఒక కథను సెలక్ట్ చేసుకునేందుకు కిరణ్ ఖచ్చితంగా ప్రశంసలు దక్కించుకుంటాడని చిత్ర యూనిట్ సభ్యులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. అర్జున్ రెడ్డి సినిమాలో ఉన్న ముద్దు సీన్స్ కారణంగా అప్పట్లో వివాదం నడిచింది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఉండకపోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఖచ్చితంగా కె ర్యాంప్ సినిమాలోని ముద్దు సీన్స్‌కి సెన్సార్ బోర్డ్ నుంచి కత్తెరింపు ఉండవచ్చు. ఎ సర్టిఫికెట్ ఇచ్చి కూడా ఒకటి రెండు తగ్గించడం లేదా కుదించడం వంటివి చేస్తారు అని యూనిట్ సభ్యులు అనుకుంటున్నారు. అయితే యూనిట్ సభ్యులు మాత్రం సాధ్యం అయినన్ని ఎక్కువ ముద్దు సీన్స్‌ను సినిమాలో ఉంచాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఫ్యామిలీస్ రారు, పిల్లలు చూడరు అనే భయం లేదని, ఖచ్చితంగా ఈ సినిమాను అందరూ చూస్తారని యూనిట్ సభ్యులు నమ్మకంగా ఉన్నారు. ప్రస్తుతానికి సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో ఈ విషయాన్ని గురించి పెద్దగా ప్రస్తావించడం లేదు. సినిమా విడుదల సమయంకు ఎన్ని ముద్దు సీన్స్ ఉంటాయో అనేది చూడాలి. అక్టోబర్ 18న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాపై కిరణ్ అబ్బవరం చాలా నమ్మకంగా కనిపిస్తున్నారు. ఆయన ప్రమోషన్ సమయంలో చాలా కాన్ఫిడెంట్‌గా మాట్లాడటం చూస్తూ ఉంటే సినిమా పట్ల ఆయన నమ్మకం కనిపిస్తుంది. ఈ సినిమాలో కిరణ్ అబ్బవరంకు జోడీగా యుక్తి తరేజా హీరోయిన్‌గా నటించింది. సినిమాలో హీరో, హీరోయిన్ పాత్రలు చాలా విభిన్నంగా ఉంటాయి. ఇద్దరు ఇద్దరే అన్నట్లుగా బోల్డ్‌గా ఉంటారట. అందుకే సినిమాలో అన్ని ముద్దు సీన్స్‌కు స్కోప్ ఉంటుందని, సినిమా చూస్తున్న సమయంలో ముద్దు సీన్స్ కావాలని పెట్టినట్లు అనిపించదు అని, సందర్భానుసారంగానే లిప్ లాక్ సీన్స్ ఉంటాయని చిత్ర యూనిట్ సభ్యులు చెబుతున్నారు. మొత్తానికి కిరణ్ అబ్బవరం అభిమానులతో పాటు అందరూ ఈ సినిమా కోసం ఎదురు చూసే విధంగా ప్రచారం జరుగుతోంది. మరి కిరణ్ అబ్బవరంకు ఈ సినిమా విజయాన్ని అందిస్తుందా అనేది చూడాలి.

# ఎన్టీఆర్ కెరీర్ ఫినిష్.. ఈ దశాబ్దపు అతి పెద్ద జోక్..!



సోషల్ మీడియా వచ్చింది కదా ఎవరికి ఇష్టం వచ్చినట్టు మాట్లాడే అవకాశం వచ్చింది. అలాంటి అవకాశం ఉంది కదా అని ఎలా పడితే అలా మాట్లాడినా.. అలాంటి కామెంట్స్ చేసినా సరే దానికి తగిన ప్రతిఫలం అనుభవించాల్సి ఉంటుంది. అందులోనూ తమ అభిమాన హీరోని ఏమాత్రం తక్కువ చేసి మాట్లాడినా సినిమా హీరోలనే వదలరు ఇక మిగతా వాళ్లను ఎలా వదిలేస్తారు. ఈ క్రమంలోనే బాలీవుడ్ సినీ క్రిటిక్ అని చెప్పుకునే కమల్ ఆర్ ఖాన్ వార్ 2 ఫ్లాప్ వల్ల చాలా విషయాల్లో మార్పు వచ్చింది అంటూ లేటెస్ట్‌గా తన సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశాడు. వార్ 2 ఫ్లాప్ వల్ల చాలా మార్పులు.. వార్ 2 ఫ్లాప్ వల్ల చాలా మార్పులు వచ్చాయి.. యష్ రాజ్ ఫిలింస్ క్రిష్ 4లో నిర్మించట్లేదు.. డైరెక్టర్ అయాన్ ముఖర్జీని ధూమ్ 4 నుంచి తప్పించారు. హృతిక్ రోషన్ యష్ రాజ్ ఫిలింస్‌తో ఫ్యూచర్‌లో వర్క్ చేయకూడదని నిర్ణయించుకున్నాడు. యష్ రాజ్ ఫిలింస్ నెక్స్ట్ ఫిల్మ్ ఎన్టీఆర్ తో చేయాల్సింది అది క్యాన్సిల్ చేశారు. కియరా అద్వాని కెరీర్ ముగిసినట్టే.

ఎన్టీఆర్ కెరీర్ కూడా హిందీ మూవీస్‌లో ముగిసినట్టే అని రాసుకొచ్చాడు. ఐతే కమల్ ఆర్ ఖాన్ కామెంట్స్‌కి బాలీవుడ్ స్టార్స్ కాదు అక్కడ ఆడియన్స్ పట్టించుకోవడం కూడా మానేశారు. అలాంటిది సౌత్ ఆడియన్స్ పట్టించుకుంటారా అంటే.. అఫ్కోర్స్ యష్ రాజ్ ఫిలింస్, హృతిక్ రోషన్, కియరా అద్వాని, అయాన్ ముఖర్జీ వీళ్ల గురించి ఏం రాసుకున్నా ఇక్కడ ఎన్ టీ ఆర్ పేరుని మెన్షన్ చేశాడు కదా.. అది ఎన్టీఆర్ ఫ్యాన్స్ ని ఫైర్ అయ్యేలా చేసింది. ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఎటాకింగ్.. సినిమా క్రిటిక్ అని చెప్పుకుంటూ కమల్ ఆర్ ఖాన్ ఏం చేస్తున్నాడంటూ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఎటాకింగ్ మొదలు పెట్టారు. అంతేకాదు ఎన్టీఆర్ యాక్టింగ్ గురించి అతనికి ఏం తెలుసని మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. ఇక కొందరు ఫ్యాన్స్ అయితే సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాలో రావు రమేష్ డైలాగ్స్ వాడేస్తూ వాడిని అలా వదిలి పెట్టకండ్రా.. ఎవరికైనా చూపించండ్రా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. బాలీవుడ్‌లో ఏం జరుగుతుంది అన్నది అసలు జరిగేది కాదు తనకు తానుగా గాసిప్పులు క్రియేట్ చేస్తూ సినిమా వాళ్లను టార్గెట్ చేస్తూ వస్తున్న కమల్ ఆర్ ఖాన్ పోస్ట్ లను బాలీవుడ్ స్టార్స్ ఎప్పుడో లైట్ తీసుకున్నారు. కానీ ఈసారి ఎన్టీఆర్‌ని టచ్ చేసి తప్పు పనిచేశాడు కమల్ ఆర్ ఖాన్. ఇప్పుడే కాదు సౌత్ స్టార్స్ విషయంలో ఇదివరకు కూడా కమల్ ఆర్ ఖాన్ విషాన్ని కక్కాడు.

ఐతే ఇప్పుడు ఎన్టీఆర్ పై కూడా హిందీలో కెరీర్ ఫినిష్ అయ్యిందన్న కామెంట్స్‌కి అంతకంత ఒక రేంజ్‌లో అతన్ని ట్రోల్ చేస్తూ సోషల్ మీడియాలో ఎన్టీఆర్ ఫ్యాన్స్ హడావిడి చేస్తున్నారు. కమల్ ఆర్ ఖాన్ ఒక పెద్ద జోకర్.. ఎన్టీఆర్ హిందీ కెరీర్ పూర్తవడం అన్నది ఈ దశాబ్దలు అతిపెద్ద జోక్ అంటూ కొందరు నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# అసలు సిసలు 'రెబలిజం' ఏంటో చూస్తారా..?



కొన్ని కాంబినేషన్స్ సినిమాలు వస్తున్నాయని తెలిస్తే జస్ట్ ఒక కామెంట్ వచ్చినా చాలు ఫ్యాన్స్‌లో ఎక్స్ పెక్టేషన్స్ ఒక రేంజ్‌లో ఉంటాయి. అందులోనూ పాన్ ఇండియా స్టార్ తో పాన్ ఇండియా డైరెక్టర్ సినిమా అనే టాక్ వస్తే చాలు ఆ ఫ్యాన్స్‌కి ఇక ఫెస్టివల్ అన్నట్టే. అలాంటి ఒక నెక్స్ట్ లెవెల్ కాంబో ఒకటి రెడీ చేసే పనిలో ఉన్నారు. ఇంతకీ ఏంటా కాంబో అంటే రెబల్ స్టార్ ప్రభాస్‌తో పాన్ ఇండియా డైరెక్టర్ సుకుమార్ సినిమా ఉండబోతుందట. సుకుమార్‌తో ప్రభాస్ అసలు ఊహించని కాంబో ఇది. సుకుమార్ సినిమాలు పుష్ప ముందు వరకు పాన్ ఇండియా వరకు వెళ్లలేదు కానీ పుష్ప రెండు భాగాలతో బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. పుష్ప సినిమా ప్రతి విషయంలో సుకుమార్ మార్క్ కనిపిస్తుంది. పార్ట్ 1 పుష్ప ది రైజ్‌కి ఏమాత్రం తగ్గకుండా పుష్ప ది రూల్‌ని తెరకెక్కించాడు సుకుమార్. ఐతే పుష్ప 3 రాంపేజ్ కూడా అనౌన్స్ చేసినా దానికి ఇంకాస్త టైం పట్టేలా ఉందని తెలుస్తుంది. ఇక సుకుమార్ నెక్స్ట్ సినిమా రాం చరణ్‌తో చేస్తాడని తెలిసిందే. మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. చరణ్ సినిమా తర్వాత సుకుమార్‌తో ప్రభాస్ సినిమా ఉంటుందని టాక్. ఈ కాంబినేషన్‌ని ప్రముఖ నిర్మాత దిల్‌రాజు సెట్ చేస్తున్నారట. ఒకప్పుడు భారీ సినిమాలతో టాలీవుడ్‌లో తన బ్యానర్ రేంజ్ ఏంటో చూపించిన దిల్ రాజు గేం ఛేంజర్‌తో పాన్ ఇండియా అటెంప్ట్ చేసినా వర్క్ అవుట్ కాలేదు. ఆ సినిమా రిజల్ట్ తర్వాత భారీ సినిమాల జోలికి వెళ్లకూడదు అనుకున్నారు. కానీ సుకుమార్ డైరెక్షన్‌లో ప్రభాస్ సినిమా ప్లాన్ చేస్తున్నారట.

ప్రభాస్‌తో సుకుమార్ సినిమా అంటే అది ఎలా ఉంటుందంటూ ఇప్పటి నుంచే ఒక అంచనా వేస్తున్నారు మేకర్స్. సుకుమార్ ప్రభాస్‌తో పుష్ప ముందులా క్లాస్ అండ్ టెక్నికల్ హైస్టాండర్డ్ మూవీతో వస్తాడా లేదా రంగస్థలం, పుష్ప సినిమా తరహాలో మాస్ కథతో వస్తారా అన్నది చూడాలి. ఐతే ప్రభాస్‌లోని అసలు సిసలు రెబలిజం ఎలా ఉంటుందో సుకుమార్ చూపించ గలిగితే మాత్రం అది వేరే లెవెల్‌లో ఉంటుందని తెలుస్తుంది. ఐతే ప్రభాస్ ఇప్పుడు మరో కొత్త సినిమా మొదలు పెట్టాలంటే ఎలా లేదన్నా రెండేళ్లు వెయిట్ చేయాల్సిందే. అసలైతే దిల్ రాజు బ్యానర్ లో ప్రభాస్, ప్రశాంత్ వర్మ కాంబో మూవీ ఉంటుందని టాక్ వచ్చింది. కానీ ఇప్పుడు ప్రశాంత్ వర్మ కాదు సుకుమార్, ప్రభాస్ కాంబోని దిల్ రాజు సెట్ చేస్తున్నట్టు చెప్పుకుంటున్నారు.

# 'ఫంకీ' టీజర్.. విశ్వక్ మాస్‌లో అనుదీప్ కితకితలు




టాలీవుడ్ యంగ్ హీరో, మాస్ కా దాస్ విశ్వక్ సేన్.. ఇప్పుడు ఫంకీ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. జాతిరత్నాలు, ప్రిన్స్ వంటి సినిమాలను తెరకెక్కించిన కేవీ అనుదీప్ దర్శకత్వం వహిస్తుండగా.. కోలీవుడ్ బ్యూటీ కాయదు లోహర్ మూవీలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఆ సినిమా షూటింగ్ ఇప్పుడు శరవేగంగా జరుగుతోంది. కామెడీ ఎంటర్టైనింగ్ చిత్రాలకు కేరాఫ్‌గా నిలిచిన అనుదీప్ డైరెక్షన్‌లో విశ్వక్ సేన్.. సినిమా చేస్తుండడంతో ఆడియన్స్ మంచి అంచనాలు పెట్టుకున్నారు. తాజాగా మేకర్స్ ఫంకీ టీజర్‌ను రిలీజ్ చేయగా.. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అందరినీ ఆకట్టుకుని దూసుకుపోతోంది.. చిన్నప్పుడు అమ్మ చెప్పిన మాట వినలేదు రా మను అంటూ ఫన్నీ డైలాగ్‌తో టీజర్ స్టార్ట్ అయింది. ఆ తర్వాత విశ్వక్ ఎంట్రీ ఇచ్చారు. తాను చదువుకున్న స్కూల్‌లోని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ కనిపించారు. "నేను ఇంత పెద్ద డైరెక్టర్ అవ్వడానికి కారణం ఈ స్కూల్లో చదువుకోవడం.. స్కూల్‌లో చదువుకున్నాకే నాకు చదువుపై విరక్తి పుట్టింది.. అందుకే సినిమాల్లోకి వెళ్లా" అని చెబుతారు. ఆ తర్వాత పంచ్ డైలాగ్స్‌తో అదరగొడతారు. నేనెక్కడినే లేకుంటే లేనట్లే.. వన్స్ వస్తే ఇక్కడే ఉంటా.. మా బావకు సినిమాలో బావ క్యారెక్టర్ ఇస్తా అనే డైలాగ్స్ ఫన్నీగా ఉన్నాయి. కామెడీ ఎంటర్టైనర్ గా రాబోతున్న ఫంకీ.. సినీ ఇండస్ట్రీపై సెటైరికల్‌గా తెరకెక్కుతున్నట్లు టీజర్ ద్వారా క్లారిటీ వచ్చింది. అనుదీప్ దర్శకత్వంలో ఫన్ ఏ స్థాయిలో ఉంటుందో తెలిపేలా టీజర్ ఎంతో హాస్యభరితంగా, ఓ విందు భోజనంలా ఉందనే చెప్పాలి. సినిమాలో విశ్వక్ సేన్ చాలా కొత్తగా.. డైరెక్టర్ రోల్‌లో కనిపించనున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. హీరోయిన్ కాయదు లోహర్ తన అందంతో కట్టిపడేశారు. టీజర్‌లో భీమ్స్ సిసిరోలియో సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తనదైన నేపథ్య సంగీతంతో ప్రతి షాట్‌ను మరో స్థాయికి తీసుకెళ్లారు. దర్శకుడు అనుదీప్ మార్క్ టీజర్‌లో అడుగడుగునా కనిపించింది. జాతిరత్నాలుకు మించి నవ్వులను పంచనున్నారని టీజర్ ద్వారా తెలుస్తోంది. నవీన్ నూలి ఎడిటింగ్ సినిమాను ఆకర్షణీయంగా ప్రజెంట్ చేస్తుందని హామీ ఇస్తుంది. సురేష్ సారంగం కెమెరా పనితనం టీజర్‌ను మరింత అందంగా మలిచింది. కథకు తగ్గట్టు ప్రతి ఫ్రేమ్ అందంగా కనిపిస్తూ, విజువల్‌గా అద్భుతంగా ఉంది. నిర్మాతలుగా ఎక్కడా రాజీ పడకుండా నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద ఫంకీ టీజర్ ప్రేక్షకులు మనస్ఫూర్తిగా నవ్వుకునే ఎంటర్టైనర్‌గా మూవీగా ఉంటుందని హామీ ఇస్తుంది.

# క్యాబినెట్ నిర్ణయాలు

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన 32 వ ఇ-క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనం ప్రచార విభాగంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖా మాత్యులు కొలుసు పార్థసారధి మీడియాకు వివరించారు. నేడు జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 1,27,181 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు మరియు 78,771 ఉద్యోగాలకు ఆమోదం లభించింది. అనకాపల్లి జిల్లాలో అధునాతన కార్బన్ కాంప్లెక్స్ తయారీ, పలనాడు జిల్లాలో సిమెంట్ ప్లాంట్ మరియు గుడిపల్లి మరియు టేకులోడు (అనంతపురం జిల్లా)లో ఏరోస్పేస్ & ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ పరిశ్రమల స్థాపనకు ఆమోదం లబించింది. ఈ ప్రాజెక్టులు మొత్తం 5,800 కోట్ల రూపాయల పెట్టుబడి లక్ష్యంగా 6,646 మందికి ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. ప్రకాశం జిల్లాలో ప్రొపెల్లెంట్ ప్లాంట్‌కు, కర్నూలు జిల్లాలో పారిశ్రామిక ఎస్టేట్ అభివృద్ధికి, విశాఖపట్నం జిల్లాలో పారిశ్రామిక & లాజిస్టిక్స్ హబ్‌కు, కర్నూలు జిల్లాలో ఇన్నోవేషన్ సెంటర్ కు, విజయనగరం జిల్లాలో ప్రైవేట్ మెగా పార్క్‌కు భూమి కేటాయింపుకు అనుమతులు ఇవ్వబడ్డాయి. 56,353 ఉద్యోగ అవకాశాల కల్పన లక్ష్యంగా 8,186 కోట్ల రూపాయల పెట్టుబడులను అవకాశం కల్పిస్తూ ఈ కేటాయింపులు జరిగాయి. ఇతర ముఖ్యమైన ప్రాజెక్టులలో విశాఖపట్నంలో డేటా సెంటర్ మరియు ఐటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేయడానికి ఆమోదం లబించింది. అమరావతిలో 4-స్టార్ హోటళ్లు, విశాఖపట్నం జిల్లా అరకు వ్యాలీలో ఒక లగ్జరీ రిసార్ట్, శ్రీశైలం (నంద్యాల జిల్లా)లో 3-స్టార్ హోటల్ మరియు కాకినాడ జిల్లాలో ఒక కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం లబించింది. సౌర విద్యుత్ మరియు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు అనంతపురం, విజయనగరం, కర్నూలు మరియు నంద్యాల జిల్లాల్లోను, కర్నూలు, ఏలూరు మరియు చిత్తూరు జిల్లాల్లో ఆహార ప్రాసెసింగ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆమోదం లబించింది. జూన్ 2024లో ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాష్ట్ర మంత్రివర్గం 149 ప్రతిపాదనలను ఆమోదించి INR 7.37 లక్షల కోట్ల పెట్టుబడులకు మరియు 6.97 లక్షల ఉపాధి కల్పనకు అవకాశం కల్పించడం జరిగింది.

**01. ఇంధన శాఖ:**

కర్నూల్ & నంద్యాల జిల్లాల్లో ఇప్పటికే ఆమోదించిన 349.50 MW సామర్థ్యానికి M/s ఆంపిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ ప్రైవేట్ లిమిటెడ్ విండ్ సోలార్ హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం ముందుగా కేటాయించిన సరిహద్దుల్లోనే 1.80 MW విండ్ మరియు 0.50 MW AC సోలార్ సామర్థ్యాలను 349.50 MW సామర్థ్యానికి పెంచేందుకు M/s ఆంపిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క గ్రూప్ కంపెనీలు అయిన M/s ఆంపిన్ ఎనర్జీ ట్రాన్సిషన్ ప్రైవేట్ లిమిటెడ్ అభ్యర్థనపై చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. పునరుత్పాదక ఇంధన విద్యుత్ ప్రాజెక్టులు పర్యావరణ అనుకూలమైనవి మరియు ఇంధన భద్రతను నిర్ధారిస్తాయి. పవన టర్బైన్ల ఎంపిక మరియు గ్రిడ్ కనెక్టివిటీ అవసరాల కారణంగా మంజూరు చేయబడిన సామర్థ్యాలలో పవన మరియు సౌర సామర్థ్యాలను పెంచాల్సిన అవసరం ఉంది. ఇరవై ఐదు సంవత్సరాలకు రూ. 0.72 కోట్లు గ్రీన్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఫండ్, ఎకరానికి రూ. 50,000 చొప్పున స్థానిక ప్రాంత అభివృద్ధి ఛార్జీలు వసూలు చేయబడతాయి. గతంలో మంజూరు చేయబడిన 1200 మంది సభ్యులకు అదనంగా సుమారు ఐదు మంది సభ్యులకు ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధి కల్పించబడుతుంది.

02. ఇంధన శాఖ:

M/s చింత గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ చేసిన అభ్యర్థనపై రెండు ప్రతిపాదనలు అనగా: (1) విజయనగరం జిల్లా మక్కువ మండలం దుగ్గేరు వద్ద 2000 MW దుగ్గేరు PSP ప్రాజెక్ట్ కేటాయింపునకు మరియు (2) AP ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద దుగ్గేరు PSP కోసం జలవనరుల శాఖ మార్గదర్శకాలు మరియు లభ్యతకు అనుగుణంగా వెంగళరాయ సాగర్/ వెంగళ రావు సాగర్ II/ తోటపల్లి రిజర్వాయర్ల నుండి వన్‌టైమ్ ఫిల్లింగ్ కోసం 24 MCM నీటి కేటాయింపు మరియు వార్షిక ఆవిరి నష్టాలకు 1.50 MCM నీటి కేటాయింపునకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ భారీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు నుండి నలభై సంవత్సరాలకు రూ. 1,230 కోట్లు గ్రీన్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఫండ్ ఉత్పత్తి అవుతుంది. ఎకరానికి రూ. 50,000 చొప్పున స్థానిక ప్రాంత అభివృద్ధి ఛార్జీలు వసూలు చేయబడతాయి. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు మూడు వేల మంది సభ్యులకు ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధి కల్పించబడుతుంది.

03. ఇంధన శాఖ:

AP ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం ఎర్రగూడి, అవులెన్న, సిరిపి, దూదెకుంట, అంకంపల్లి మరియు తగుపార్తి గ్రామాల్లో 400 MW AC/ 560 సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం M/s టాటా పవర్ రీన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ అభ్యర్థనపై చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇతర డెవలపర్ల RE పవర్ సామర్థ్యాలు మరియు విండ్ రిసోర్స్ అసెస్‌మెంట్ స్టడీలకు కేటాయించిన ప్రాంతాలతో అతివ్యాప్తి లేకుండా ఈ కేటాయింపు జరుగుతుంది. ఈ సౌర విద్యుత్ ప్రాజెక్టు నుండి ఇరవై ఐదు సంవత్సరాలకు రూ. 126 కోట్ల గ్రీన్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఫండ్ ఉత్పత్తి అవుతుంది. పన్నెండు సంవత్సరాలకు రూ. 1.50 లక్షలు/మెగావాట్ చొప్పున మరియు మిగిలిన పదమూడు సంవత్సరాలకు సంవత్సరానికి రూ. 50,000 చొప్పున స్థానిక ప్రాంత అభివృద్ధి ఛార్జీలు వసూలు చేయబడతాయి. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు వెయ్యి మూడు వందల ఎనభై మంది సభ్యులకు ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధి కల్పించబ




డుతుంది.

04. ఇంధన శాఖ:

AP ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద అనంతపురం జిల్లా వజ్రకరూర్ మండలం కమలపాడు, కొనకొండ్ల మరియు గుల్లపాలెం గ్రామాల్లో 600 MWh BESS తో పాటు 400 MW AC/ 580 MWp DC సోలార్ పవర్ ప్రాజెక్ట్ కేటాయింపు కోసం M/s ACME ఉర్జా వన్ ప్రైవేట్ లిమిటెడ్ అభ్యర్థనపై చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇతర డెవలపర్లకు ఇప్పటికే కేటాయించిన RE పవర్ సామర్థ్యాలు మరియు విండ్ రిసోర్స్ అసెస్‌మెంట్ స్టడీల ప్రాంతాలతో అతి వ్యాప్తి లేకుండా ఈ కేటాయింపు జరుగుతుంది.

05. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ శాఖ:

మధ్య తరహా సంస్థలకు భూమి కేటాయింపు విధానానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్స్ పాలసీ (4.0) 2024-29కు సవరణ చేసేందుకు చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ టెక్ హబ్‌లకు భూమి ప్రోత్సాహకం విధానం (4.0) 2024-29 టైర్-2 నగరాల్లో రాష్ట్ర పోటీతత్వాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం మధ్య తరహా సంస్థలు మరియు అభివృద్ధి చెందుతున్న రంగాలకు ఎకరానికి రూ.4 కోట్ల చొప్పున పెట్టుబడికి సిద్ధంగా ఉన్న భూమిని అందిస్తుంది, 500 ఉద్యోగాలు మరియు 12 నెలల్లో ప్రాజెక్ట్ కార్యాచరణకు హామీ ఇస్తుంది. IT/ITES, GCCలు, డేటా సెంటర్లు, క్లౌడ్ & వర్క్‌ప్లేస్ సొల్యూషన్స్ మరియు IT ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లను లక్ష్యంగా చేసుకుని పారిశ్రామిక వృద్ధిని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రాంతీయ ఉపాధి కల్పన, అభివృద్ధి, ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న సమతుల్య మరియు పెట్టుబడి కేంద్రంగా ఉంచడం లక్ష్యం.

06. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ శాఖ:

విశాఖపట్నం జిల్లా భీమిలిలోని కాపులుప్పాడలోని సర్వే నంబర్ 401 వద్ద ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు ఎకరానికి 2 కోట్ల రూపాయల చొప్పున 4.05 ఎకరాల భూమిని APIIC ద్వారా కేటాయించడానికి మరియు AP IT & GCC పాలసీ (4.0) 2024-29 ప్రకారం ఈ ప్రాజెక్టును పరిగణనలోకి తీసుకోవడానికి మరియు రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు సిఫార్సు చేసిన విధంగా 140 కోట్ల రూపాయల ప్రతిపాదిత పెట్టుబడికి ప్రోత్సాహకాలను అందజేయడానికి తద్వారా 2,600 ఉద్యోగాల కల్పినకు అవకాశం కల్పించేందుకు ఐ.టి.ఇ. & సి. శాఖ చేసిన ప్రతిపానకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. దీని ద్వారా నూట నలభై కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టి రెండు వేల ఆరు వందల ఉద్యోగాలను సృష్టించనుంది. AP IT & GCC పాలసీ 4.0లో పేర్కొన్న కనీస అర్హత ప్రమాణాలను గణనీయంగా మించి, దాని రాబోయే 4.05 ఎకరాల సౌకర్యం ద్వారా లాజిస్టిక్స్ మరియు సప్లై చైన్ డొమైన్‌లో IT సేవలను అందించనుంది. ఈ పెట్టుబడి స్థానిక IT పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, అనుబంధ పరిశ్రమలు, సేవా ప్రదాతలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిని కూడా ఉత్ప్రేరకపరుస్తుంది. సృష్టించబడిన IT ఉద్యోగాలు అధిక-విలువైన ఉపాధి అవకాశాలను అందిస్తాయి, డిజిటల్ నైపుణ్య అభివృద్ధిను పెంపొందిస్తాయి మరియు ఈ ప్రాంతంలో సమ్మిళిత ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తాయి.

07. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ శాఖ:

రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు సిఫార్సు చేసిన విధంగా INR 87,520 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడి ద్వారా మెస్సర్స్ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్సు-పవర్డ్ డేటా సెంటర్లను ఏర్పాటు చేయడానికి విశాఖపట్నం జిల్లాలోని అడవివరం మరియు తర్లువాడ గ్రామాలు మరియు అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లిలలో 480 ఎకరాల భూమిని మరియు ప్రత్యేక ప్రోత్సాహకాలను కేటాయించడానికి తద్వారా 200 ప్రత్యక్ష ఉద్యోగాల కల్పనకై ఐ.టి.ఇ. & సి. శాఖ చేసిన ప్రతిపానకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెల్పింది. గూగుల్ అనుబంధ సంస్థ అయిన రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ. 87,520 కోట్ల భారీ పెట్టుబడితో నాలుగు వందల ఎనభై ఎకరాల్లో విస్తరించి ఉన్న అత్యాధునిక డేటా సెంటర్ సౌకర్యాలను స్థాపించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రెండు వందల ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు వేలాది పరోక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయి. నెదర్లాండ్స్, వర్జీనియా మరియు తైవాన్ వంటి ప్రాంతాలలో గూగుల్ డేటా సెంటర్ పెట్టుబడులు స్థిరంగా పరివర్తన ప్రయోజనాలను అందించిన నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ కూడా ఇలాంటి అభివృద్ధి లాభాలను అనుభవించడానికి సిద్ధంగా ఉంది. ఈ డేటా సెంటర్ సౌకర్యాలు నిర్మాణం, తయారీ మరియు IT సేవలు వంటి రంగాలలో అధిక నాణ్యత గల ఉపాధిని సృష్టిస్తాయి. అదే సమయంలో రాష్ట్ర డిజిటల్ మౌలిక సదుపాయాలను గణనీయంగా పెంచుతాయి. అధునాతన సాంకేతికతలు మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ ఆధారిత సామర్థ్యాల ఉనికి ఆవిష్కరణలను వేగవంతం చేస్తుంది, మరింత పెట్టుబడులను ఆకర్షిస్తుంది మరియు స్థానిక సంస్థలకు సాంకేతిక శక్తిని అందిస్తుంది.

08. M/S JSW ఇండస్ట్రియల్ పార్క్ లిమిటెడ్ - ప్రైవేట్ మెగా పార్క్ విజయనగరం జిల్లాలో 1,166.43 ఎకరాల్లో ప్రైవేట్ మెగా ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధి చేయడానికి M/s JSW ఇండస్ట్రియల్ పార్క్ లిమిటెడ్ ప్రతిపాదనను ఆమోదించింది. రూ. 531 కోట్ల పెట్టుబడితో, ఈ మల్టీ-యూటిలిటీ MSME పార్క్ 45 వేల ఉద్యోగాలను సృష్టిస్తుంది. శృంగవరపుకోట మండలంలోని మూసిడిపల్లి, చీడిపాలెం, చినకందేపల్లి, ఎం.బి. వార మరియు కిల్తంపాలెం గ్రామాల్లో స్థాపించబడే ఈ పార్క్‌లో వస్త్రాలు, వ్యవసాయ ప్రాసెసింగ్, ఎలక్ట్రిక్ వాహన తయారీ, గ్రీన్ హైడ్రోజన్ మరియు లాజిస్టిక్స్ సౌకర్యాలు ఉంటాయి. ఎకరాకు మూడు లక్షల క్యాపిటల్ సబ్సిడీ మరియు భూమి మార్పిడి, వినియోగ మార్పు మరియు లేఅవుట్ ఆమోదం ఛార్జీలలో వంద శాతం మినహాయింపు మంజూరు చేయబడింది.

09. M/S ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ - మల్లవల్లి ఫుడ్ పార్క్

లూలూ గ్రూప్‌లో భాగమైన M/S ఫెయిర్ ఎక్స్‌పోర్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు మల్లవల్లి మెగా ఫుడ్ పార్క్‌లోని 7.48 ఎకరాల కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌ను 66 సంవత్సరాలకు సంవత్సరానికి రూ. 50 లక్షలకు లీజుపై అలాగే, ప్రతి ఐదు సంవత్సరాలకు ఐదు శాతం పెంపుదలతో కేటాయించడం జరిగింది. పండ్ల ప్రాసెసింగ్ లైన్లు, మూడు వేల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్, రైపెనింగ్ చాంబర్లు మరియు వేర్‌హౌసింగ్ సామర్థ్యంతో కూడిన ఈ అత్యాధునిక సౌకర్యం స్థానికంగా సేకరించిన వ్యవసాయ ఉత్పత్తులను ప్రాసెస్ చేస్తుంది.

10. M/S ఎమ్మెన్నార్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ - జరిమానా మినహాయింపు

అనకాపల్లిలోని JN ఫార్మసిటీలో M/S ఎమ్మెన్నార్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ. 18.09 కోట్ల ప్రాజెక్టు అమలు ఆలస్యానికి విధింపబడిన జరిమానా రుసుములలో మినహాయింపును ఆమోదించింది. కంపెనీ 22.18 ఎకరాల్లో నిర్మాణాన్ని పూర్తి చేసి, రూ. 160 కోట్లు పెట్టుబడి పెట్టి, రూ. 198 మందికి ఉపాధి కల్పించనుంది. మూడు అనుబంధ సంస్థలు ఆవరణలో తయారీ సౌకర్యాలను నిర్వహించేలా మొత్తం విస్తీర్ణానికి సేల్ డీడ్ అమలు చేయబడుతుంది.

11. M/S భారత్ డైనమిక్స్ లిమిటెడ్ - రక్షణ తయారీ సౌకర్యం రక్షణ మంత్రిత్వ శాఖ సార్వజనిక రంగ సంస్థ అయిన M/S భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌కు ప్రకాశం జిల్లా దోనకొండ గ్రామంలో ప్రొపెల్లెంట్ ఉత్పత్తి సౌకర్యం మరియు ఆయుధ వ్యవస్థ ఇంటిగ్రేషన్ కాంప్లెక్స్ స్థాపించడానికి 1,400 ఎకరాలు కేటాయించడం జరిగింది. రెండు దశల్లో రూ. 1200 కోట్ల పెట్టుబడితో 1400 ఉద్యోగాలను సృష్టించే ఈ ప్రాజెక్టులో తయారీ సౌకర్యం కోసం 1,200 ఎకరాలు స్వాధీనంలో ఉన్న భూమికి ఎకరాకు రూ. 7.73 లక్షలు, మిగిలినవి వాస్తవ కొనుగోలు ధరతో మరియు టౌన్‌షిప్ అభివృద్ధికి అదనంగా 146.67 ఎకరాలు కేటాయించడం జరిగింది.

12. ప్రధాన పారిశ్రామిక ప్రాజెక్టుల అదనపు అభ్యర్థనలు

మంత్రివర్గం నాలుగు ప్రధాన పరిశ్రమల అదనపు అభ్యర్థనలను ఆమోదించింది. అనకాపల్లిలో యాభై ఐదు వేల కోట్ల ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ కోసం M/S ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్‌కు దశల వారీగా చేసిన భూమి చెల్లింపులపై రూ. 12.58 కోట్ల వడ్డీ మినహాయింపు మంజూరు చేయబడింది. రామయపట్నం రిఫైనరీ స్థలంలో రోడ్డు రీఅలైన్‌మెంట్ కోసం M/S భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ అభ్యర్థన ఆమోదించబడింది, అభివృద్ధి వ్యయం రూ. 113 కోట్లను BPCL భరిస్తుంది. నాయుడుపేటలో కార్బన్ బ్లాక్ ప్లాంట్ కోసం M/s PCBL కెమికల్ లిమిటెడ్ యొక్క రూ. 2,717 కోట్ల సవరించిన పెట్టుబడి ప్రతిపాదన సర్దుబాటు చేసిన కాలపరిమితులతో అంగీకరించబడింది. M/S భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ మార్చి 2029 నాటికి రూ. 1400 కోట్లు పెట్టుబడికి సంబంధించిన ప్రోత్సాహకాల అభ్యర్థన ఆమోదించబడింది.

13. కొత్త పారిశ్రామిక కేటాయింపులు

మూడు కొత్త కంపెనీలకు భూమి కేటాయింపులు ఆమోదించబడ్డాయి. M/S అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియాకు 36.25 కోట్ల పెట్టుబడితో మహిళా శక్తి భవన్ మరియు మహిళా పారిశ్రామిక ఎస్టేట్ స్థాపించడానికి కర్నూల్ ఓర్వకల్‌లో ముప్పై ఎకరాలను ఎకరాకు పది లక్షలకు కేటాయించడం జరిగింది, ఇది మూడు వేల మంది మహిళా వ్యవసాయవేత్తలకు ఉద్యోగాలను సృష్టిస్తుంది. M/S అవంతి వేర్‌హౌ సింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ. 319 కోట్ల పెట్టుబడితో పారిశ్రామిక లాజిస్టిక్స్ హబ్ దశ-1 కోసం విశాఖపట్నంలోని గుర్రంపాలెంలో ఇరవై ఎకరాలు ఎకరాకు ఎనభై లక్షలకు కేటాయించబడ్డాయి. M/S ఆక్సెల్ESG (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు AI-ఆధారిత పర్యావరణ పర్యవేక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, సెన్సార్లు మరియు బయోచార్ ఉత్పత్తి కోసం ఇన్నోవేషన్ సెంటర్ స్థాపించడానికి కర్నూల్ కృష్ణగిరి మండలంలో 80 ఎకరాలు రాయితీ రేటు ఎకరాకు ఒక లక్షకు కేటాయించబడ్డాయి, ఇది రూ. 300 కోట్ల పెట్టుబడి మరియు 300 మందికి ఉపాధి కల్పిస్తుంది.

14. M/S లూలూ ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్ - విశాఖపట్నం మెగా మాల్

విశాఖపట్నం బీచ్ రోడ్‌లో 13.74 ఎకరాల్లో మెగా షాపింగ్ మాల్ ప్రాజెక్ట్ కోసం M/S లూలూ ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సవరించిన లీజు అద్దె నిబంధనలను ఆమోదించింది. వార్షిక లీజు అద్దె 7.08 కోట్లకు నిర్ణయించబడింది, ప్రతి పది సంవత్సరాలకు పది శాతం పెంపుదలతో, మూడు సంవత్సరాల అద్దె-రహిత నిర్మాణ కాలంతో. ఈ ప్రాజెక్ట్‌లో 1,066 కోట్ల పెట్టుబడి ఉంటుంది మరియు 500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కల్పించబడతాయి.

15. రేమండ్ గ్రూప్ - M/S JK మైని కంపెనీలు

రేమండ్ గ్రూప్ యొక్క రెండు అనుబంధ సంస్థల కోసం సమగ్ర ప్రతిపాదనలను ఆమోదించింది. M/s JK మైని ప్రెసిషన్ టెక్నాలజీ లిమిటెడ్‌కు ఆటోమోటివ్ కాంపోనెంట్ తయారీ కోసం అనంతపురం గుడిపల్లి ఇండస్ట్రియల్ పార్క్‌లో 30 ఎకరాలను ఎకరాకు 45.95 లక్షలకు కేటాయించడం జరిగింది, రూ. 430 కోట్ల పెట్టుబడి మరియు 4,096 ఉద్యోగావకాశాలు కల్పించనుంది. M/s JK మైని గ్లోబల్ ఏరోస్పేస్ లిమిటెడ్‌కు ఏరోస్పేస్ కాంపోనెంట్ తయారీ కోసం గుడిపల్లి మరియు తేకులోడు అంతటా 47.28 ఎకరాలు కేటాయించబడ్డాయి, రూ. 510 కోట్ల పెట్టుబడి మరియు 1,400 ఉద్యోగావకాశాలు కల్పించనుంది.

16. పారిశ్రామిక విస్తరణ ప్రతిపాదనలు

మంత్రివర్గం రెండు ప్రధాన పారిశ్రామిక విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించింది. M/s సన్వీరా ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు అనకాపల్లి రాంబిల్లిలో 122.01 ఎకరాల్లో అధునాతన కార్బన్ కాంప్లెక్స్ స్థాపించడానికి ఆమోదం లభించింది, రూ. 260 కోట్ల పెట్టుబడితో 800 ఉద్యోగాలు సృష్టించబడతాయి. ఎకరాకు రూ. 80 లక్షల రాయితీ ధరతో భూమి కేటాయించబడుతుంది, కార్బన్ క్యాథోడ్స్, గ్రాఫైట్ ఎలక్ట్రోడ్స్ మరియు స్పెషాలిటీ ఉత్పత్తులు తయారు చేయబడతాయి. పల్నాడు జిల్లాలో M/s శ్రీ సిమెంట్ లిమిటెడ్ ఇంటిగ్రేటెడ్ సిమెంట్ ప్లాంట్ విస్తరణ కోసం రెండు వేల రెండు వందల అరవై కోట్ల పెట్టుబడికి 350 మంది అదనపు ఉద్యోగాలతో ఆమోదం పొందింది.

17. పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి హడ్కో రుణ హామీ

మంత్రివర్గం సెప్టెంబర్ 29, 2025న ఆర్థిక శాఖ అమలు చేసిన ఐదు వేల కోట్ల రుణానికి సంబంధించిన హామీ డీడ్ మరియు లెటర్ ఆఫ్ కంఫర్ట్‌ను ఆమోదించింది. APIIC లిమిటెడ్ యొక్క పూర్తి అనుబంధ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ స్టేట్ స్పెషల్ ప్రాజెక్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తరపున హడ్కో నుండి 8.60 శాతం వడ్డీతో ఈ రుణానికి ఆమోదం తెలిపింది. ఈ నిధులు కర్నూల్‌లోని ఓర్వకల్, వైఎస్సార్ కడప జిల్లాలోని కొప్పర్తి మరియు ప్రకాశం జిల్లాలోని పామురు వద్ద మూడు వ్యూహాత్మక పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేయడానికి ఉపయోగించబడతాయి.

యువజన అభివృద్ధి, పర్యాటక & సాంస్కృతిక శాఖ

రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. వాటికి కావలసిన ప్రోత్సాహకాలను అందజేయటం, భూములను తక్కువ ధరలకే కేటాయించడం ద్వారా ఈ రంగ అభివృద్ధికి దోహదపడుతున్నది. నేడు జరిగిన రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో ఏడు పర్యాటక ప్రాజెక్టులకు రాష్ట్రమంత్రి మండల ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో దాదాపు రూ.1,628.8 కోట్ల పెట్టుబడులకు అవకాశం కలిగింది. తద్వారా 4,398 మందికి ప్రత్యక్షంగా ను మరికొన్ని వేల మందికి పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగునున్నాయి.

18. M/s సదర్న్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్:

అమరావతిలో M/s సదర్న్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్‌కు 4-స్టార్ హోటల్ (కోర్ట్‌యార్డ్ బై మారియట్) అభివృద్ధికై ప్రోత్సాహకాలు అందించేందుకు SIPB సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.176.96 కోట్ల పెట్టుబడి, 300 మందికి ఉద్యోగ అవకాశాలు.

19. M/s శ్రీ వెంకటేశ్వర లాడ్జ్ ప్రైవేట్:

శ్రీశైలంలో M/s శ్రీ వెంకటేశ్వర లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 3-స్టార్ హోటల్ (హిల్టన్ గార్డెన్ ఇన్ బ్రాండ్) అభివృద్ధికై ప్రోత్సాహకాలు అందించేందుకు SIPB సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.83 కోట్ల పెట్టబడి, 300 మందికి ఉద్యోగ అవకాశాలు.

20. M/s దసపల్లా అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్:

అమరావతిలో M/s దస్పల్ల అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 4-స్టార్ హోటల్ (దస్పల్ల బ్రాండ్) అభివృద్ధికై ప్రోత్సాహకాలు అందించేందుకు SIPB సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.200 కోట్ల పెట్టుబడి, 400 మందికి ఉద్యోగ అవకాశాలు.

21. M/s మైరా బేవ్యూ రిసార్ట్స్‌కు మైరా బేవ్యూ రిసార్ట్స్ & కన్వెన్షన్ సెంటర్ :

విశాఖపట్నంలో కొత్తవలస వద్ద M/s మైరా బేవ్యూ రిసార్ట్స్‌కు మైరా బేవ్యూ రిసార్ట్స్ & కన్వెన్షన్ సెంటర్ అభివృద్ధికై భూమి మరియు ప్రోత్సాహకాలు అందించేందుకు SIPB సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.255.91 కోట్ల పెట్టుబడి, 500 మందికి ఉద్యోగ అవకాశాలు.

22. M/s VSK హోటల్స్ & రిసార్ట్స్:

అరకు వ్యాలీలో M/s VSK హోటల్స్ & రిసార్ట్స్ LLP కు ఈకో - లగ్జరీ రిసార్ట్ అభివృద్ధికై ప్రోత్సాహకాలు అందించేందుకు SIPB సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ. 55.84 కోట్ల పెట్టుబడి, 98 మందికి ఉద్యోగ అవకాశాలు.

23. M/s ట్రైడెంట్ తిరుపతి లిమిటెడ్ & ఓబెరాయ్ (విలాస్) రిసార్ట్ :

తిరుపతిలో ఉన్న Sy.No.588/A లో ఉన్న Acs.20.00లో M/s ట్రైడెంట్ తిరుపతి లిమిటెడ్‌కు ఓబెరాయ్ (విలాస్) రిసార్ట్ అభివృద్ధికై భూమి కేటాయింపుకు SIPB సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆమోదించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. కొన్ని మినహాయింపులు మరియు చెల్లింపుల సవరణ కూడా చేయడం జరిగింది. రూ.250 కోట్ల పెట్టుబడి, 1500 మందికి ఉద్యోగ అవకాశాలు.

# 50 శాతం మెడికల్ సీట్లు ప్రైవేటు కోటాకు కేటాయించింది జగన్ ప్రభుత్వమే

**- పీపీపీ విధానం వల్లే రాష్ట్ర విద్యార్థులకు అదనంగా 220 సీట్లు లభ్యం - ఇతర రాష్ట్రాల్లో కూడా ఇదే విధానం - జగన్ మాత్రం అవగాహన లేని విమర్శలు**

**- ప్రజా వనరుల దోపిడీ చేసినది జగన్ ప్రభుత్వం - హెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు బహిరంగ లేఖ విడుదల చేస్తూ జగన్ ప్రభుత్వ అబద్ధాలను, ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పీపీపీ విధానం వల్ల రాష్ట్ర విద్యార్థులకు మెరుగైన వైద్య విద్యా అవకాశాలు లభిస్తాయి. కానీ జగన్ ప్రభుత్వం నాటకం ఆడి, తన కాలంలో చేసిన తప్పులను ఇప్పుడు ఇతరులపై మోపేందుకు ప్రయత్నిస్తోంది అని పల్లా స్పష్టం చేశారు. ప్రైవేట్ కోటాకు 50 శాతం సీట్లు కేటాయించింది జగన్ ప్రభుత్వమే. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 50 శాతం సీట్లు ప్రైవేటు కోటాకు కేటాయిస్తూ జీ.ఓ. నం. 107, 108, 133లను విడుదల చేసింది జగన్ ప్రభుత్వం. ఇది పచ్చి వాస్తవం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అదే అంశాన్ని విద్యార్థుల మేలు దిశగా పీపీపీ విధానంలో అమలు చేస్తే, దానిని తప్పుగా చూపే ప్రయత్నం ప్రజలను మోసం చేయడమే అని అన్నారు. జగన్ హయాంలో 18% పనులు కూడా పూర్తి కాలేదు. జగన్ ప్రభుత్వ కాలంలో రాష్ట్ర నిధులు రూపాయి కూడా మెడికల్ కాలేజీల నిర్మాణాలకు ఖర్చు కాలేదని పల్లా వెల్లడించారు. నిర్మాణాలకు ఉపయోగించిన మొత్తం రూ.1,550 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులే. రాష్ట్రం నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదు. నాలుగేళ్ల జగన్ పాలనలో నిర్మాణాలు పూర్తి అయినవి కేవలం 18 శాతం మాత్రమే. అదే రీతిలో కూటమి ప్రభుత్వం కొనసాగితే, 17 కాలేజీల నిర్మాణానికి 15 ఏళ్లు పడతాయి" అని వివరించారు. జగన్ కాలంలో మురిగిపోయే సీట్లు – కూటమి విధానంతో రక్షణ. జగన్ పాలన కొనసాగితే 1,750 మెడికల్ సీట్లు మురిగిపోయే ప్రమాదం ఉండేది. పీజీ సీట్లు కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడేది. కానీ పీపీపీ విధానంతో ప్రభుత్వం నడపడం వలన ప్రభుత్వ కోటాలోనే 110 సీట్లు అదనంగా లభిస్తున్నాయి. ప్రైవేట్ కోటాలో కూడా మరో 110 సీట్లు పెరుగుతాయి. మొత్తం 220 సీట్లు విద్యార్థులకు అదనంగా లభించనున్నాయి" అని పల్లా స్పష్టం చేశారు. పీపీపీ పద్ధతిలో ప్రభుత్వ కోటా కొనసాగుతుంది. ప్రభుత్వ ఫీజు యథాతథం. ప్రస్తుత పీపీపీ పద్ధతిలో కూడా 50 శాతం సీట్లు ప్రభుత్వ కోటాలోనే భర్తీ అవుతాయి. ఫీజు కూడా ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. ప్రజల మేలు కోసం, విద్యార్థుల అవకాశాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నది అని పల్లా వివరించారు. రాబోయే రెండేళ్లలోనే ఈ కాలేజీల నిర్మాణం పూర్తవుతుందని, విద్యార్థులు త్వరలోనే వైద్య విద్యను పొందే అవకాశం కలుగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో కూడా ఇదే విధానం – జగన్ మాత్రం అవగాహన లేని విమర్శలు. కర్నాటకలో ఇప్పటికే 12 మెడికల్ కాలేజీలు పీపీపీ విధానంలో నిర్మాణం జరుగుతున్నాయి. అనేక రాష్ట్రాలు ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయి. గతంలో చంద్రబాబు పాలనలో జేగురుపాడు విద్యుత్ ప్లాంట్ కూడా పీపీపీ విధానంలో నిర్మించారు. 33 ఏళ్లు పూర్తయిన తరువాత అది ప్రభుత్వ సొత్తుగా మారింది. ఇదే విధంగా విద్యా రంగంలో కూడా పీపీపీ పద్ధతి ప్రజల మేలు దిశగా పనిచేస్తుంది అని ఆయన వివరించారు.

**ప్రజా వనరుల దోపిడీ చేసినది జగన్ ప్రభుత్వం**

గంగవరం పోర్టును ప్రైవేటు కంపెనీకి అమ్మేసింది జగన్ ప్రభుత్వం. విశాఖ స్టీల్ ప్లాంట్ భూములను కూడా ప్రైవేటులకు అప్పగించే కుట్ర చేసింది. ఇవన్నీ జగన్ హయాంలోనే జరిగాయి. ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధి ఆగిపోవాలన్న ఉద్దేశంతో, వైద్య రంగ అభివృద్ధిని అడ్డుకునేందుకు జగన్ ముఠా కుట్రలు పన్నుతోంది అని పల్లా అన్నారు.

**జగన్ విధ్వంస పాలన కారణంగా నిధుల కొరత**

జగన్ రెడ్డి పాలనలో జరిగిన అవినీతి, అవ్యవస్థ, దుర్వినియోగం కారణంగా కూటమి ప్రభుత్వం నిధుల కొరతను ఎదుర్కొంటోంది. ఉన్న కొద్దిపాటి నిధులు మెడికల్ కాలేజీలకు ఖర్చు చేస్తే, సంక్షేమ పథకాలు, ఉద్యోగుల జీతాలు, మౌలిక వసతులు అన్నీ దెబ్బతింటాయి. ఇదే జగన్ రెడ్డి కుట్ర. రాష్ట్ర పరిపాలనను గందరగోళంలోకి నెట్టడమే ఆయన ఉద్దేశ్యమని ఆయన తీవ్రంగా విమర్శించారు.

**విద్య, వైద్య రంగాల్లో చంద్రబాబు దూరదృష్టి**

1995–2004 మధ్య చంద్రబాబు నాయుడు జిల్లాకొక మెడికల్ కాలేజీ, రెవిన్యూ డివిజన్‌కొక ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు చేశారు. అందువల్లే నేడు రాష్ట్రంలో డాక్టర్ల కొరత లేదు. నలుగురు ఎన్‌ఆర్‌ఐల్లో ఒకరు తెలుగువారే అని చెప్పడం ఆయన దూరదృష్టికి నిదర్శనం. అదే స్ఫూర్తితో వైద్య విద్యను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తున్నది కూటమి ప్రభుత్వం అని పల్లా పేర్కొన్నారు.

**హైబ్రిడ్ విధానం వల్లే సమతూక అభివృద్ధి**

నేడు ఆంధ్రప్రదేశ్‌లో 18 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, మరో 18 ప్రైవేట్ మెడికల్ కాలేజీలు సమతూకంగా పనిచేస్తున్నాయి. ఇది చంద్రబాబు అనుసరించిన హైబ్రిడ్ విధానం వల్లే సాధ్యమైంది. చైనా, వియత్నాం లాంటి దేశాలు ఇదే విధానం అనుసరించి ఆర్థిక శక్తులుగా ఎదిగాయి. కానీ క్యూబా, ఉత్తర కొరియా దేశాలు పిడివాదం వల్ల వెనుకబడ్డాయి. ఈ ఉదాహరణలు హైబ్రిడ్ విధానం సార్వత్రికతను నిరూపిస్తున్నాయి అని ఆయన అన్నారు.

**రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం జగన్ చేసిన దుర్వినియోగం**

మెడికల్ కాలేజీల పేరుతో జగన్ రెడ్డి చేసినది రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదు, రాజకీయ లాభం కోసం మాత్రమే. వైద్య రంగాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్నాడు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం వైద్య ఆరోగ్య ప్రమాణాల్లో 2014–19లో చంద్రబాబు పాలనలో రాష్ట్రం 4వ స్థానంలో ఉండగా, జగన్ పాలనలో (2019–24) 10వ స్థానానికి పడిపోయింది. ఇది జగన్ పాలన వైఫల్యానికి నిదర్శనం," అని పల్లా పేర్కొన్నారు.

**చంద్రబాబు పాలనలోనే 28 మెడికల్ కాలేజీలు స్థాపన**

జగన్ ప్రచారం చేస్తున్నట్లుగా చంద్రబాబు ఒక్క మెడికల్ కాలేజీని కూడా స్థాపించలేదనడం పచ్చి అబద్ధం. ఎన్టీఆర్ , చంద్రబాబు పాలించిన కాలంలో ఉమ్మడి రాష్ట్రం, నవ్యాంధ్రలో కలిపి మొత్తం 28 మెడికల్ కాలేజీలు స్థాపించారు. ఆయన సంకల్పం 'హెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నిర్మాణమే. ప్రజా ప్రయోజనం కోసం కూటమి ప్రభుత్వం కూడా అదే మార్గంలో నడుస్తోంది," అని ఆయన స్పష్టం చేశారు.

# ధాన్యం సేకరణకు అవసరమగు ఏర్పాట్లను వెంటనే చేయాలి

**- ఈ ఖరీఫ్ లక్ష్యం 4.5 లక్షల మెట్రిక్ టన్నులు - ఈ నెల 30 లోపల బ్యాంకు గ్యారంటీలు పూర్తి కావాలి**

**- తేమ యంత్రాలు, గోనె సంచులు, సిద్ధం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**







**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఈ ఖరీఫ్‌కు గానూ 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్ణ యించడం జరిగిందని, పంట కొనుగోళ్ళకు అవసరమగు ఏర్పాట్ల తో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి సేకరణ కమిటీ సమావేశం కలేక్టరేర్ సమావేశ మందిరంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయి, గ్రామ స్థాయి కమిటీలను కూడా వెంటనే ఏర్పాటు చేయాలనీ సూచించారు. వ్యవసాయ శాఖ వారు పంట వెరైటీ, దిగుబడి వచ్చే సమయం, సేకరణ పై మండల స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది కి శిక్షణ లు పూర్తి చేయాలనీ, మద్దతు ధర, ట్రక్ షీట్ విధానం, తదితర అంశాలపై విస్తృతంగా ప్రచారం గావించాలన్నారు. ఆర్.ఎస్.కేలతో మాపింగ్, రైతుల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలనీ తెలిపారు. పౌర సరఫరాల అధికారి మిల్లులను ట్యాగ్ చేయడం, బ్యాంకు గ్యారంటీలను తీసుకోవడం, అన్ని మిల్లుల పని చేస్తున్నదీ లేనిదీ తనిఖీ చేయడం, సి.ఎస్.డి.టి లకు శిక్షణ పూర్తి చేయడం వంటి కార్యక్రమాలను పూర్తి చేయాలన్నారు. సేకరణకు అవసరమగు మెటీరియల్‌ను సరఫరా చేయడం, చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం, వర్షాలు పడితే టార్పాలీన్ సరఫరా చేయడానికి మండల కేంద్రాల్లో సిద్ధం చేయాలనీ మార్కెటింగ్ ఏ.డికు సూచించారు. ప్రాధమిక సహకార సంఘాల ద్వారా కొనుగోళ్ళు చేయడానికి 57 సొసైటీలు సిద్ధంగా ఉన్నాయని, వారికీ శిక్షణ పూర్తి చేసుకోవాలని తెలిపారు. వాహనాలకు జి.పి.ఎస్ ఏర్పాటు చేయడం, తూకపు యంత్రాలను ఏర్పాటు చేయడం, హమాలీలను గుర్తించడం ఆయా శాఖలు వెంటనే చేయాలన్నారు. మిల్లర్ల నుండి, రైతుల నుండి చిరగని గోనె సంచులను సేకరించడం, గిడ్డంగులను సిద్ధం చేయడం వంటి పనులపై కూడా దృష్టి పెట్టాలని, ధాన్యం సేకరణకు అవసరమగు షెడ్యూల్ వేసుకొని, అన్ని పనులను అక్టోబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలనీ సూచించారు. సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ మాట్లాడుతూ గత ఏడాది సేకరణలో తలెత్తిన సమస్యలపై వివరించారు. గత ఏడాది జిల్లాలో 159 మిల్లులు పని చేసాయని, ఈ ఏడాది 158 మాత్రమే పని చేస్తున్నాయని తెలిపారు. ఆర్.ఎస్.కేలను వాటి పరిధిలో వచ్చే పంటను బట్టి ఏ,బి,సిలుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ బొడ్డేపల్లి శాంతి, ఆర్.డి.ఓలు కీర్తి, రాం మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి భారతి, జిల్లా సహకార అధికారి రమేష్, ఏ.డి మార్కెటింగ్ రవి కిరణ్, మిల్లర్ల, రైతు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా బాణాసంచా విక్రయిస్తే కఠిన చర్యలు

**- అనధికార తయారీదార్లను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలి - విక్రయదారులు అన్ని రకాల భద్రతాచర్యలను పాటించాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి**







**విజయనగరం, (రాజధాని వార్తలు):** అనుమతి లేకుండా బాణా సంచాను విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. గ్రామస్థాయిలో సైతం తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో జిల్లాలో నిర్వహిస్తున్న బాణా సంచా విక్రయాలు, తయారీపై పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్లలో మొత్తం ముగ్గురు తయారీ దారులు ఉన్నారని, 15 మంది హోల్‌సేల్ విక్రయదారులు ఉన్నారని డి.ఆర్.ఓ శ్రీనివాసమూర్తి వివరించారు. ఆర్.డి.ఓలు డి.కీర్తి, మోహనరావు, ఆశయ్య మాట్లాడుతూ తమ డివిజన్ల పరిధిలో బాణాసంచా విక్రయాల గురించి వివరించారు. కలెక్టర్ రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, బాణాసంచాను ఏ స్థాయిలో విక్రయించినా అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. హోల్‌సేల్ షాపులను పోలీస్, ఫైర్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేయాలన్నారు. గ్రామాల్లో జరిపే విక్రయాలను వి.ఆర్.ఓలు తనిఖీ చేయాలని ఆదేశించారు. విక్రయాల కోసం అనుమతి పొందిన వారు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని అన్నారు. అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, సిసి కెమేరాలను ఏర్పాటు చేయాలని, నీరు అందుబాటులో ఉంచాలని, ఫైర్ సిలండర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. తాత్కాలిక విక్రయాలకు అనుమతిచ్చే చోట షాపులమధ్య ఫైర్ ఇంజన్ వెళ్లేందుకు వీలుగా ఖాళీలు ఉంచాలని చెప్పారు. షెడ్లను టెంట్లకు బదులుగా రేకులతోనే నిర్మించాలని సూచించారు. విక్రయదారులతో సమావేశాలను ఏర్పాటు చేసి, వారికి నిబంధనలను వివరించాలని ఆర్‌డిఓలను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అగ్నిమాపక అధికారి రాంప్రసాద్, డిఎస్‌పి వీర్‌కుమార్, మున్సిపల్ కమిషనర్లు, తాహసీల్దార్లు పాల్గొన్నారు.

# రేణిగుంట సబ్ డివిజన్ నెలవారీ నేర సమీక్షా సమావేశం



**రేణిగుంట, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా పోలీస్ అధికారి సుబ్బారాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సబ్–డివిజన్ పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సబ్–డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ & నాన్ గ్రేవ్ కేసులు, హత్య, పోక్సో & రేప్, డెకాయిటి, రాబరీ, ప్రాపర్టీ కేసులు, వాహన దొంగతనాలు, మిస్సింగ్, చీటింగ్, 174 సి.ఆర్.పి.సి కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, డిపిఓ పెండింగ్ ఫైల్స్, ఎన్ బి డబ్ల్యు ఎస్, ఎన్ డి పి ఎస్ కేసులు మొదలైన వాటిపై పోలీసు స్టేషన్ వారీగా సమీక్ష జరిగింది. కేసుల ఛేదింపును వేగవంతం చేయడం, నేర నియంత్రణ చర్యలను బలోపేతం చేయడం వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసులు వీలైనంత త్వరగా పరిష్కరించి, దర్యాప్తు పూర్తయిన కేసులలో చార్జిషీట్లు ఆలస్యం లేకుండా దాఖలు చేయాలని సూచించారు. పోక్సో & రేప్ కేసులు దర్యాప్తు వేగం పెంచి శాస్త్రీయ పద్ధతుల్లో విచారణ చేపట్టాలని ఆదేశించారు. మహిళల, చిన్నారుల అదృశ్య కేసులలో ఏ విధమైన అలసత్వం చూపకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. సి సి టి ఎన్ ఎస్ రికార్డులలో కేసుల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని ఆదేశించారు. రాత్రిపూట గస్తీ, బీట్స్ పెంపు, ఆస్తి నేరాల నివారణ, రౌడీ షీటర్లపై నిఘా, మరియు రికవరీ శాతం పెంపు చర్యలను సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఐ ఆర్ ఏ డి డేటా విశ్లేషణ ద్వారా ప్రమాద ప్రాంతాలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి అన్నారు. అలాగే, మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు, సైబర్ సురక్ష ద్వారా ప్రజలకు విద్యార్థులకు అవగాహన, సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై ప్రచారం, పేకాట, కోడిపందేలు, చట్టవ్యతిరేక కార్య కలాపాలపై కట్టడి చేయాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ పెంపు, గ్రామాల సందర్శన తప్పనిసరి, ప్రజలతో స్నేహభావం పెంపు ద్వారా ప్రజా విశ్వాసం పొందాలని డీఎస్పీ సూచించారు. పోలీసు అధికారులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకొని, సాంకేతికత వినియోగంతో సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని డీఎస్పీ సూచించారు. నిందితులను త్వరితంగా అరెస్ట్ చేయడం, నాణ్యమైన దర్యాప్తు నిర్వహించడం, పెండింగ్ కేసులను తగ్గించడం వంటి అంశాలలో ప్రతిభ కనబరిచిన అధికారులను అభినందించారు. ఈ సమావేశంలో రేణిగుంట సీఐ– ఎస్.జయచంద్ర, గాజులమండ్యం సీఐ–ఎం.మంజునాథ రెడ్డి, ఏర్పేడు సీఐ–బి. శ్రీకాంత్ రెడ్డి ఎస్సైలు టి.వి.సుధాకర్, శ్రీకాంత రెడ్డి, డబ్ల్యూ పి ఐఎస్‌ఐలు బి వెంకటలక్ష్మి, డి ప్రవళ్ళిక, బి.స్వాతి మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజ్, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎవ్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మీ సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాలను తనిఖీ నిర్వహించిన ఎస్పీ మీనా

## - కొత్తపేట మండల పరిధిలో తనిఖీలు నిర్వహించిన ఎస్పీ మీనా





**కొత్తపేట, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా కొత్తపేట మండలం పరిదిలోని బాణ సంచా తయారు, విక్రయ కేంద్రాలను గురువారం తనిఖీలు నిర్వహించారు. బాణసంచా కేంద్రాల వద్ద అగ్నిమాపక రక్షణ పరికరాలను, ఇసుక, నీరు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బాణసంచా కేంద్రాల వద్ద సీసీటీవీ లను ఏర్పాటు చేయాలని కోరారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే ప్రాణ నష్టం జరగకుండా ఉండేలాగా ముందస్తు జాగ్రత్త లను తీసుకోవాలన్నారు. బాణసంచా కేంద్రాలలో 18 సంవత్సరాలలోపు మైనర్లను పనిలోకి చేర్చుకోరాదని హెచ్చరించారు. బాణసంచా కేంద్రాలలో వద్ద సిగరెట్లు ధూమపానం జరగకుండా చూడాలని మండే గుణం కలిగినటువంటి వస్తువుల పట్ల తగిన జాగ్రత్తలను తీసుకోవాలని తయారీ యజమానులకు అధికారులు యజమానులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీలలో రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్, ఎస్బి సీఐ పుల్లారావు, కొత్తపేట ఎస్ఐ సురేంద్ర పాల్గొన్నారు.

# ఘనంగా దర్శకుడు వినాయక్ జన్మదిన వేడుకలు





**రావులపాలెం, (రాజధాని వార్తలు):** ఎన్నో విజయవంతమైన చిత్రాలను ప్రేక్షకులకు అందించి సినీ పరిశ్రమలలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న ప్రముఖ సినీ దర్శకులు గండ్రోతు వీర వెంకట వినాయక్ (వివి వినాయక్) జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. వినాయక్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలం పరిధిలోని ఈతకోట గ్రామంలో వివి వినాయక్ సేవా యాత్ సర్కిల్ అధ్యక్షులు గండ్రోతు దుర్గాసురేష్. గండ్రోతు వీరగోవిందరావు. గండ్రోతు దుర్గాదేవి ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వినా యక్ ఆయురారోగ్యాలతో అనేక చిత్రాలకు దర్శక త్వం వహించి విజయం సాణతీంచాలని కోరుకుంటు ఆయన గోత్ర నామాలతో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాయతీ వీధిలో గల కమ్యూనిటీ హాల్ రామాలయం వద్ద పెద్దలు, యువత, నాయకులు చేతులు మీదుగా కేక్ కట్ చేసి మెగా డైరెక్టర్ వినాయక్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పుట్టినరోజు పురస్కరిం చుకుని శ్రీకాళహస్తి, తిరుపతి పలు దేవాయలను దర్శించుకున్న వివి వినాయక్‌తో గండ్రోతు సోదరులు ఫోన్లో మాట్లాడి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోదూరి చింతరావు, గుబ్బల రాంమోహన్ రావు (రాము), బోరుసు సుబ్రహ్మణ్యం, గండ్రోతు రాజు, కొప్పినీడి రామకృష్ణ (రాము), అడబాల నరేష్, గండ్రోతు సత్యనారాయణ, వినుకొండ రామకృష్ణ, సలాది ప్రకాష్, రాచకొండ రాముడు, కొప్పినీడి సత్తిపండు, గండ్రోతు నాగేశ్వరరావు, కర్రి అయ్యప్ప, గండ్రోతు వీరన్న, యాళ్ళ సాయి, యర్రంశెట్టి శివ, జనిపిరెడ్డి మణికంఠ, ఎలుబోలు ప్రసాద్, గండ్రోతు మణికంఠ, దంగేటి పండు, కర్రి వెంకటరమణ, జనిపిరెడ్డి నారాయణ, గండ్రోతు దుర్గాప్రసాద్, గండ్రోతు పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ జీఎస్టీ స్లాబ్‌ల కుదింపు ఆర్థికపరమైన ఊరట



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వం దసరా కానుకగా దేశ ప్రజలకు అందించిన నూతన జీఎస్టీ 2.0కు స్లాబుల తగ్గింపు పై పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రచారం చేపట్టారు. జివిస్టీకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంచుతూ జీఎస్టీ స్లాబుల కుదింపు వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు భారీగా ఆర్థికపరమైన ఊరట కలుగుతుందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. తిరుపతి, దివిలి గ్రామాల్లో జీఎస్టీ తగ్గింపుపై ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చినరాజప్ప పాల్గొని మాట్లాడుతూ మొత్తం 83 రకాల వస్తువులపై జివిస్టి తగ్గింపు జరిగిందన్నారు. స్లాబుల తగ్గుదల సామాన్యులతో పాటు వ్యాపార వర్గాలకు మేలు చేసే విధంగా ఉందన్నారు. జీఎస్టీ స్లాబుల తగ్గుదలతో ప్రతీ కుటుంబానికి రూ. 15 వేల వరకు ఆదా అవుతుందన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో కూటమి ప్రభుత్వం సామాన్యుల ప్రయోజనాల కోసమే పని చేస్తుందని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయులు నిమ్మకాయల రంగనాగ్, గ్రామాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# తగ్గించిన జివిస్టితో ప్రజలకు మేలు

**అల్లవరం, (రాజధాని వార్తలు):** కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జివిస్టితో ప్రజలకు మేలు జరుగుతుందని సర్పంచ్ రోక్కాల విజయలక్ష్మి అన్నారు. అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామపంచాయితీ కార్యాలయం వద్ద సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన సూపర్ జీఎస్టీ– సూపర్ సేవ్ 2.0 పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లు నాలుగు స్లాబులుగా ఉన్న జీఎస్టీని రెండు స్లాబులుగా తగ్గించి ప్రజలకు మేలు చేశారన్నారు. జీఎస్టీ తగ్గించడంతో అనేక వస్తువులపై పన్ను భారం తగ్గి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. గ్రామంలోని పలు ప్రాంతాలలో జివిస్టి 2.0 బ్రోచర్లను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షులు ముత్యాల బాబీ, రొక్కాల




నాగేశ్వరరావు, మొయిల గణపతి, బస్వాని వెంకటేశ్వరరావు, కార్యదర్శి దూనబోయిన బాబ్జి,నెల్లి విజయ, రాపాక సౌమ్య, డి. ఉమా భవాని, గుత్తుల బేబీ దుర్గా, ఆశా కార్యకర్తలు, గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan